

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

23.09.2026

బుధవారం | రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 84

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదు

- ఇప్పుడు భయపడతామా జగన్?!
- మంత్రి నారా లోకేష్ సంచలన కామెంట్లు
- గురువులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్న
- గొడ్డలి పార్టీ రౌడీ బ్యాచ్ ఎక్కడున్నా వదలం
- అండమాన్‌లో ఉన్నా, ఆస్ట్రేలియాలో ఉన్నా
- పట్టుకుని చట్టప్రకారం శిక్షిస్తామని కామెంట్



అనంతపురం సెప్టెంబర్ 22 అనంత జనశక్తి ప్రతినిధి

గురువులపై దాడి చేసిన గొడ్డలి పార్టీ రౌడీ బ్యాచ్ ఎక్కడున్నా వదలమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. అండమాన్‌లో ఉన్నా, ఆస్ట్రేలియాలో ఉన్నా వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. మంగళవారం రాప్తాడు నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తల సమావేశంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ మాట్లాడారు. ఈ సందర్భంగా విజయవాడ శాప్ కార్యాలయం వద్ద సోమవారం చోటు చేసుకున్న సంఘటనపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ.. తనపై కోపం ఉంటే తేల్చుకుందాం.. రా.. టీచర్ల జోలికొస్తే సహించేది లేదంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు.

డేట్, టైమ్ ఫిక్స్ చేయి... డీఎస్సీతోపాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని వారికి మంత్రి లోకేశ్ సవాల్ విసిరారు. నీతి, నిజాయితీలతో బతికిన కుటుంబం తమదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సీఎం చంద్రబాబుపై ఒక్క ఆరోపణ అయినా నిరూపించగలిగారా? అంటూ వైసీపీ నేతలను ఆయన నిలదీశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదు.. ఇప్పుడు భయపడతామా జగన్?! అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎంకు ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ చురకలంటించారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా**

ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేపట్టిన పర్యటనలో ఒక మానవీయ కోణం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా రాప్తాడులో తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని, అక్కడి నుంచి పుట్టపర్తి విమానాశ్రయానికి తిరుగు ప్రయాణమైన మంత్రి కాన్వాయ్ మార్గమధ్యంలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం ప్రాంతం గుండా వెళుతోంది.


2లో..

# ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగతం

- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- అన్ని చరణాలు పాడకపోవడం నేరం కాదు
- ఆర్టికల్ 25, 26 ప్రకారం మతపరమైన అభ్యంతరాలుంటే..
- క్రిమినల్ చర్యలు తీసుకోలేరని వ్యాఖ్య

2లో..







# హైదరాబాద్ హోటల్‌లో విశాఖ యువతి మృతి

- ఆసుపత్రిలో పడేసి ప్రియుడి పరార్!
- మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
- యువతి అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ల వెల్లడి
- వెల్లడించిన వెంటనే ప్రియుడు పరార్


2లో..

## విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో

# ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- మా హయాంలో 24 గంటలు ఇచ్చాం
- రైతులకు ఎలాంటి కష్టాలు రాలేదు
- కాంగ్రెస్ 7 గంటలకు మించి ఇవ్వట్లేదు

2లో..





## అణగారిన వర్గాల అభ్యున్నతికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

- సీఎం రేవంత్ రెడ్డి కామెంట్
- ఎస్సీ, ఎస్టీ చట్టం అమలుపై సీఎం సమీక్ష
- అట్రాసిటీ కేసులపై ప్రత్యేక నిఘా
- బాధితులకు తక్షణ పరిహారం అందించాలి
- అధిక కేసుల గ్రామాలపై ఫోకస్
- విజిలెన్స్ సమావేశాలు సకాలంలో నిర్వహించాలి
- విద్యతోనే సామాజిక మార్పు
- సంక్షేమంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం
- రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేద్దాం



హైదరాబాద్, సెప్టెంబర్ 22, అనంత జనశక్తి న్యూస్

దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్సీ, ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ముఖ్యమంత్రి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన చట్టం అమలుపై ఈ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మళ్లీ ఈ సమావేశం జరగడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళి నాయక్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2లో..

# ఫ్లాష్ ఫ్లడ్స్ అలెర్ట్

- పాఠశాలలకు సెలవు
- పలు ప్రాంతాల్లో వర్షా లు దంచికొడుతున్నాయి
- రెండ్రోజులు వానలు పడనున్నాయి
- బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం
- విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరాన్ని దాటే అవకాశం

అమరావతి, సెప్టెంబర్ 22, అనంతజనశక్తి న్యూస్

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. మరికొన్ని గంటల్లో తీవ్రవాయుగుండంగా మారనుంది. ఇది వేగంగా కదులుతూ విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ తీవ్ర వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్రవ్యాప్తంగా ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాబోయే 48 గంటల్లో అత్యంత భారీ నుంచి తీవ్ర భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. తీరం వెంట బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారింది.

2లో..

# డిసెంబర్‌లో నంది ఫిల్మ్ అండ్ టీవీ అవార్డులు

- ప్రభుత్వం కీలక ప్రకటన
- సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- అక్టోబర్‌లో ప్రకటన వెలువడుతుంది
- సెప్టెంబర్‌లో కమిటీ ఏర్పాటు చేస్తాం
- డిసెంబర్లో అవార్డుల ప్రధానోత్సవం

2లో..





అమరావతి, సెప్టెంబర్ 22: అనంత జనశక్తి న్యూస్

నంది ఫిల్మ్ అవార్డులపై ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. నంది ఫిల్మ్, టీవీ అవార్డులకు సెప్టెంబర్‌లో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టుగా తెలిపారు. అక్టోబర్‌లో ప్రకటన వెలువడుతుందని, డిసెంబర్లో అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.. 'ఇది వరలో ప్రకటించిన 2012 నుండి 2016 వరకు నంది ఫిల్మ్ అండ్ టీవీ అవార్డులను ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2017 నుండి 2024 వరకు సంవత్సరానికి 4 అవార్డుల చొప్పున (2 ప్రొడక్షన్, 2 స్పెషల్ జ్యూరీ) ఫిల్మ్ అండ్ టీవీ అవార్డులను ప్రదానం చేయడానికి ప్రభుత్వం అంగీకరిస్తూ జీవో జారీ చేసింది.

# కూటమి బలంగా ఉండాలి

- ఈ జనసేన పార్టీకి గౌరవం తగ్గకూడదు
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- పిఠాపురంలో రూ.1500 కోట్ల అభివృద్ధి పనులు
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఎవరికి గౌరవం తగ్గకూడదన్నారు పవన్ కళ్యాణ్
- పిఠాపురంలో పార్టీ కమిటీ పనిచేయడం లేదు



పిఠాపురం సెప్టెంబర్ 22 అనంత జనశక్తి న్యూస్

కూటమి ప్రభుత్వం బలంగా ఉండాలని కోరుకుంటున్నాను అంటున్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. భవిష్యత్‌లోనూ కలిసి పని చేయాలని.. కానీ ఎవరి గౌరవం తగ్గకుండా, జనసేన గౌరవానికి భంగం వాటిల్లకుండా ఉండాలన్నారు. ముందు ప్రజల అవసరాలు తీరిన తర్వాత ఆకాంక్షలు నేరవేర్చుకుందామంటూ పవన్ కళ్యాణ్ పిఠాపురంలో నిర్వహించిన సభలో కీలక వ్యాఖ్యలు చేశారు.

2లో..

## నీళ్లు అడిగితే

# అరెస్టా?

- బండి సంజయ్, డీకే అరుణ ఫైర్
- జూరాల ప్రాజెక్ట్ సందర్శనకు రాంచందర్ రావు

2లో..

# శుభకార్యానికి, రాజకీయాలకు లింక్ వద్దు

- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- కుమార్తె అంజలి రెడ్డి వివాహాన్ని అడ్డుపెట్టుకుని..
- రాజకీయాలు చేయాల్సిన ఖర్మ నాకు లేదు

2లో..



## చిన్న పిల్లల మరణాలకు

# రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలి

- మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం
- ఆదిలాబాద్ రిమ్స్‌లో షార్ట్ సర్క్యూట్
- షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు మృతి
- అత్యంత బాధాకరమని వెల్లడి

2లో..

## ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగతం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22, అనంతజనశక్తి న్యూస్**

జాతీయ గేయం వందేమాతరం ఆలాపనపై సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఎన్ని చరణాలు పాడాలనేది పౌరుల వ్యక్తిగతమని ఉద్ఘాటించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 ప్రకారం నిజమైన మతపరమైన అభ్యంతరాలు ఉన్న ఎవరిపైనా అందులోని వివాదాస్పద చరణాలు పాడలేదనే కారణంతో క్రిమినల్ చర్యలు తీసుకోలేరని తేల్చిచెప్పింది. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను తప్పనిసరిగా ఆలపించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అలాగే జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం కింద వందేమాతరాన్ని జాతీయ గీతంతో సమానంగా సవరణ చేస్తూ వెలువరించిన ఉత్తర్వులను ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

## హైదరాబాద్ హోటల్‌లో
# విశాఖ యువతి మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 22, అనంతజనశక్తి న్యూస్**

హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఆంధ్ర ప్రదేశ్ నుంచి వచ్చిన ఒక యువతి హోటల్ గదిలో తీవ్ర గాయాలతో ప్రియుడు తీసుకెళ్లాడు. ఆమెను ఆసుపత్రిలో చేర్పించిన ప్రియుడు అక్కడి నుండి పరారయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నానికి చెందిన 29 ఏళ్ల యువతి, ఆమె ప్రియుడు కలసి సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని సిద్ధిఖీ నగర్‌లో ఉన్న ఒక హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నారు. ఆ యువతి నగరంలోని ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అయితే మంగళవారం నాటికి వీరి కథ ఊహించని మలుపు తిరిగింది.

యువతి స్పృహతప్పి పడిపోవడంతో హోటల్ సిబ్బంది సహాయంతో ఆమె ప్రియుడు వెంటనే కొత్తగూడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు, ఆ యువతి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. వైద్యులు ఈ విషయాన్ని వెల్లడించిన వెంటనే, ప్రియుడు అక్కడి నుండి చాకచక్యంగా జారుకున్నాడు. ప్రేమికురాలిని ఆసుపత్రికి తీసుకొచ్చిన వ్యక్తి కనిపించకుండా పోవడంతో అనుమానం వచ్చిన వైద్య సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. యువతి ముఖం, తలపై తీవ్రమైన వాపు, గాయాల గుర్తులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీనిని బట్టి ఆమెపై తీవ్రస్థాయిలో భౌతిక దాడి జరిగినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

హోటల్ గదిలో ప్రియుడు, ప్రియురాలి మధ్య ఏదో విషయమై తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగి ఉండవచ్చని, అది కాస్తా తీవ్రమైన దాడికి దారితీసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలు బస చేసిన హోటల్ రూమ్‌ను క్లూస్ టీమ్ పరిశీలించి, వేలిముద్రలు, రక్త నమూనాలు సేకరించింది. హోటల్ కాంప్లెక్స్, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. హోటల్‌లోకి వారి రాకపోకలు, ప్రియుడు పారిపోయిన మార్గంపై ఫోకస్ చేశారు. హోటల్ మేనేజర్, సిబ్బందిని పోలీసులు ప్రశ్నించి, సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం వరకు గది వద్ద ఏమైనా అరుపులు గానీ, అనుమానాస్పద శబ్దాలు గానీ వచ్చాయా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22, అనంత జనశక్తి న్యూస్**

బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 7 గంటల కన్నా ఎక్కువగా విద్యుత్‌ను సరఫరా చేయడంలేదని ఆ పార్టీ ముఖ్యనేత, ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు రేవంత్ ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు. 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కేవలం 400 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్‌కు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను నిర్వహించడం రాదని.. అందుకే రాష్ట్రంలో తగినంత విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదని హరీశ్ ధ్వజమెత్తారు. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండి కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్టీపీసీ 800 మెగావాట్ల ప్లాంట్ ఇస్తామంటే కూడా ప్రభుత్వం నిరాకరించిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చే లోవోల్టేజీ కరెంట్‌తో రైతుల మోటర్లు కాలిపోతున్నాయని హరీశ్ రావు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం ఫెయిల్ అయిందని.. యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 4 వేల మెగావాట్లకు 400 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ విజన్‌తో దేశంలో ఎక్కడా లేని విధంగా యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించారు. యాదాద్రికి జీ10, జీ11 క్వాలిటీ కోల్ కావాలి. కానీ జీ13, జీ14 క్వాలిటీ కోల్ వాడుతున్నారు. బొగ్గు వాడకంలో నాణ్యతా లోపం ఉంది. కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగింది. భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగింది. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉంటే ఈ రోజు బొగ్గు కొరత ఎందుకు ఏర్పడుతుంది. ఈ నిల్వలు ఎక్కడ అని ప్రశ్నించేందుకు నేను క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళితే పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన సందర్భంగా 1600 మెగావాట్ల విద్యుత్ ఎన్.టి.పి.సి ద్వారా ఇస్తామని చెప్పారు. మేము తొలివిడతగా ఎన్టీపీసీ 800 మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించేలా చర్యలు తీసుకుని పవర్ తీసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వద్దు అని ఎందుకు ఖర్చు లేని పనికి ఎందుకు నో చెబుతోంది. మన దగ్గర తయారు అయ్యే సింగరేణి ఉత్పత్తి విద్యుత్ వద్దు అని రాజస్తాన్ ప్రభుత్వంతో పీపీఏ కుదుర్చుకున్నారు. రాజస్తాన్‌కు కరెంటు ఇవ్వాల్సిన అవసరం ఏముంది..? అని ప్రశ్నించారు. రైతుల పంటలు ఎండబెట్టి ఉసురుబోసుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన విద్యుత్ ఉత్పత్తిలో 3వ వంతు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు హరీశ్ రావు. రైతులకు 7 నుంచి 8 గంటలు కరెంటు ఇవ్వడం లేదు. థర్మల్ పవర్ స్టేషన్ లో 45 రోజులు బొగ్గు నిల్వలు ఉండాలి.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం నీళ్లు బేసిన్ కు సంబంధం లేని కుప్పంకు తీసుకువెళ్లారు. రేవంత్ రెడ్డి చేతకానితనాన్ని ఎల్ నినో మీద పెడుతున్నారు. ఏపీ సీఎం శ్రీశైలం నుంచి 700 కిలోమీటర్లు కృష్ణా నదీ జలాలు తీసుకువెళ్తున్నారు. బేసిన్ కాని బేసిన్ కు చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తున్నారు.

## ఫ్లాష్ ఫ్లడ్స్ అలెర్ట్

(మొదటి పేజీ తరువాయి)

దీంతో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు ఉత్తర కోస్తాకు ఫ్లాష్ ఫ్లడ్స్ అలెర్ట్ జారీ చేశారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలకు ముప్పు పొంచి ఉంది. అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ సూచనల మేరకు విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక్కడ 20 సెం.మీ కంటే ఎక్కువ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. విశాఖపట్నం, అనకాపల్లికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరికి ఎల్లో అలర్ట్ ఇచ్చారు. వర్ష తీవ్రత పెరగడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు నదులు, గెడ్డలు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. విజయనగరం జిల్లా గింజేరు గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన రహదారిపై నీరు చేరడంతో వాహనాలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. విపత్తు పరిస్థితుల దృష్ట్యా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటించారు. తీర ప్రాంత ప్రజల భద్రత కోసం పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని సచివాలయాల పరిధిలో తక్షణ పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. కలెక్టర్లు రాంసుందర్ రెడ్డి (విజయనగరం), ప్రభాకర్ రెడ్డి (పార్వతీపురం మన్యం) అధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు, బాధితులు సహాయం కోసం సంప్రదించాల్సిన 24/7 అత్యవసర కంట్రోల్ రూమ్ నంబర్లు ఏర్పాటు చేశారు. విజయనగరం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 08922236947, పార్వతీపురం మన్యం కంట్రోల్ రూమ్ 08963450347కు అత్యవసర సమయాల్లో కాల్ చేయవచ్చు. తీరప్రాంతాల ప్రజలు అనవసరంగా బయటకు రాకుండా, అధికారికంగా ఇచ్చే వాతావరణ సమాచారాన్ని మాత్రమే నమ్మాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నీళ్లు అడిగితే అరెస్టా?

**హైదరాబాద్, సెప్టెంబర్ 22, అనంత జనశక్తి న్యూస్**

బీజేపీ జూరాల ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్లిన టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు అరెస్టును కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. బీజేపీ నాయకుల హౌస్ అరెస్టులు దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూరాల ప్రాజెక్టును సందర్శించి రైతులను కలిసేందుకు వెళ్తే తప్పేముందని ప్రశ్నించారు. అటు ఎంపీ డీకే అరుణ సైతం రాంచందర్ రావు అరెస్టు తీవ్రంగా ఖండించారు. రైతులకు సాగునీరు అందించాలంటే.. సంకెళ్లు వేస్తారా? నిర్బంధిస్తారా? అంటూ నిలదీశారు. రాంచందర్ రావుతో పాటు అరెస్ట్ చేసిన బీజేపీ నాయకులందరిని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఉలికిపాటు ఎందుకు? అని ప్రశ్నించారు. బీజేపీ శ్రేణుల ఆందోళనలు మరింత ఉధృతం కాకముందే, తక్షణమే రైతాంగానికి సాగునీరు అందించాలని పేర్కొన్నారు.

జోగులాంబ గద్వాల్ జిల్లాలోని జూరాల ప్రాజెక్ట్ సందర్శనకు పార్టీ నాయకులతో కలిసి వెళ్లిన రాంచందర్ రావును పోలీసులు అడ్డుకున్నారు. జడ్చర్ల వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా బీజేపీ శ్రేణులు నినాదాలు చేశారు. రాంచందర్ రావును వెంటనే విడిచిపెట్టాలనిపోలీసుల వాహనానికి బీజేపీ కార్యకర్తలు అడ్డుపడ్డారు. జడ్చర్ల వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. తమ కష్టాలు చూడండి అంటూ రైతులు మమ్మల్ని పిలిచారని అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటే ముందే మరో పంట వేసుకోవాలని రైతులను చెప్పాలని.. పంట వేసిన తర్వాత నీళ్లు ఇవ్వకపోతే ఎలా? అంటూ నిలదీశారు. రైతాంగానికి సాగునీళ్ళు ఇచ్చేవరకు రైతుల ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. రైతుల పక్షాన బీజేపీ పోరాటం చేస్తోందని.. ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు.

# ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆ సమయంలో ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెలుపల బడి ముగిసిన తర్వాత ఇళ్లకు తిరిగి వెళ్తున్న విద్యార్థులు రోడ్డు పక్కన వేచి ఉండటాన్ని మంత్రి నారా లోకేష్ గమనించారు. వెంటనే తన కాన్వాయ్‌ను ఆపాలని ఆదేశించి, తన వాహనం నుంచి కిందకు దిగి నేరుగా ఆ విద్యార్థుల దగ్గరకు వెళ్లారు.

పిల్లలను ఎంతో ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను ఆరా తీశారు. పాఠశాలలో ప్రభుత్వం తరఫున అందిస్తున్న మధ్యాహ్న భోజనం, చిక్కీ నాణ్యత ఏ విధంగా ఉందంటూ విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మంత్రి అడిగిన ప్రశ్నకు విద్యార్థులు స్పందిస్తూ, గతంతో పోలిస్తే ఇప్పుడు పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం చాలా రుచికరంగా, నాణ్యతా ప్రమాణాలతో కూడుకుని ఉందని సమాధానం ఇచ్చారు.

పిల్లల మాటలు విని సంతోషం వ్యక్తం చేసిన మంత్రి లోకేష్, వారి చదువుల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి బాగా చదువుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనుకోని విధంగా మంత్రి తమను పలకరించి, తమతో సరదాగా మాట్లాడటంతో ఆ పాఠశాల విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి నిరుపేద విద్యార్థుల పట్ల చూపిన ఈ ప్రత్యేక చొరవ, సామాన్య ప్రజలతో మమేకమయ్యే ఆయన నాయకత్వ శైలి స్థానికంగా ఎంతగానో ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ చిన్న సంఘటన సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతూ అందరినీ ఆకట్టుకుంటోంది.



# డిసెంబర్‌లో నంది ఫిల్మ్ అండ్ టీవీ అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

2025 సంవత్సరానికి నంది ఫిల్మ్ అండ్ టీవీ అవార్డులు అందించనున్నాం.' అని మంత్రి దుర్గేష్ చెప్పారు. నంది ఫిల్మ్ అండ్ జాతీయ చలన చిత్ర (నేషనల్ ఫిల్మ్) అవార్డులను అమరావతి లేదా విజయవాడ వేదికగా ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. నంది టీవీ అవార్డులను తిరుపతి వేదికగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ అవార్డులన్నీ కూడా డిసెంబర్ 2026 లోగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని దుర్గేష్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశం మేరకు వైభవంగా నంది అవార్డులు వేడుకలు ఉంటాయని ప్రకటించారు.

**నంది నాటకోత్సవాలు**

మరోవైపు నాటక సమాజాలు, కళాకారులు, రచయితలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రతిష్టాత్మక నంది నాటకోత్సవాలు 2025తో పాటు కందుకూరి పురస్కారాలు 2026 కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ నిర్వహణ కమిటీ ప్రకటన విడుదల చేసింది. నంది నాటకోత్సవాలు 2025 కోసం పోటీ పడేందుకు నాటక సమాజాలు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వ్యక్తుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, పిల్లల నాటకాలు (చైల్డ్ ఆర్టిస్ట్స్/చిల్డ్రన్ ప్లేస్), కాలేజీ/యూనివర్సిటీ నాటకాలు, నాటకరంగం, ప్రదర్శన కళలపై రాసిన గ్రంథాలు/పుస్తకాల కోసం సేవలు అందించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

కందుకూరి పురస్కారాలు 2026 నాటకరంగానికి విశేష సేవలు అందించిన పౌరాణిక, సాంఘిక నాటక కళాకారులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, రచయితలు, నాటక సంస్థల నుండి ఈ పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో కందుకూరి రంగస్థల ప్రతిభా పురస్కారం అందించనున్నారు. జిల్లా స్థాయిలో కందుకూరి విశిష్ట పురస్కారాలు అందజేస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిపార్ట్‌మెంట్ అధికారిక వెబ్‌సైట్ www.apsftvtdc.in సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబర్ 20, 2026గా నిర్ణయించారు. హార్డ్ కాపీల సమర్పణకు చివరి తేదీ అక్టోబర్ 26 సాయంత్రం లోపు ఉంది.

దరఖాస్తులు పంపవలసిన చిరునామా: మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ , 4వ అంతస్తు, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ , విజయవాడ - 520013.

# కూటమి బలంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

పిఠాపురంలో జనసేన పార్టీ కమిటీ సరిగ్గా పనిచేయడం లేదని.. అధికారం వచ్చాక నేతలు చల్లబడ్డారన్నారు. నేతలు చల్లబడకుండా ఉండాలంటే ఏం చేయాలో తనకు తెలుసని.. అధికారులు తన క్యాంప్ ఆఫీస్ పిఠాపురంలో పెట్టాలని అధికారులకు సూచిస్తున్నారని చెప్పుకొచ్చారు. జనసేన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసి పరిస్థితిని చక్కబెడతానని.. పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై సూచనలు చేస్తానన్నారు.

గత రెండు సంవత్సరాల్లో పిఠాపురంలో జరిగిన అభివృద్ధిని అందరూ చూస్తున్నారన్నారు పవన్ కళ్యాణ్. ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. ఇప్పుడు మరో ₹1,500 కోట్లతో పలు కీలక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. పిఠాపురంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వైద్యం, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో మరింత అభివృద్ధి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పిఠాపురాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పిఠాపురంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆరోగ్య రంగంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.



పిఠాపురంలో చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు.. రూ.34 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని.. ఇప్పటికే 50% పనులు పూర్తయ్యాయన్నారు. యు.కొత్తపల్లి, చేబ్రోలు ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుర్వేద డిస్పెన్సరీ ఏర్పాటు చేశామన్నారు. రూ.7 కోట్లతో 26 కొత్త ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తున్నామని.. గత ప్రభుత్వంలో మధ్యలోనే ఆగిపోయిన 6 గ్రామ ఆరోగ్య కేంద్రాల పనులను పాడా నిధులతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పిఠాపురం ప్రజలకు మెరుగైన వైద్యం వారి ప్రాంతంలోనే అందేలా ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామన్నారు.

గత పర్యటనలో పిఠాపురం పట్టణంలో మురుగు, డ్రైనేజీ సమస్యలను స్వయంగా చూశానన్నారు పవన్ కళ్యాణ్. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఇప్పుడు పెద్ద ఎత్తున పనులు చేపడుతున్నామన్నారు. రూ.225 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని.. రోజుకు 72 లక్షల లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో రెండు STPలు నిర్మిస్తున్నామన్నారు. అలాగే రోజుకు 40 టన్నుల తడి చెత్తను శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యం కోసం ఐదు ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్ బ్లాక్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. మొగలి సూర్యుడి చెరువు అభివృద్ధి పనులు కూడా ప్రారంభించామని వెల్లడించారు.

కాలుష్య నియంత్రణ కోసం బేలింగ్ మెషిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు డిప్యూటీ సీఎం. పిఠాపురాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సుందరమైన పట్టణంగా మార్చే దిశగా మరో ముందడుగు వేశామన్నారు. గతంలో పిఠాపురంలోకి అడుగుపెట్టగానే డంప్ యార్డ్, చెత్త కుప్పలే కనిపించేవని.. ఎంతో పవిత్రమైన పాదగయ క్షేత్రం పక్కనే చెత్త వేసే పరిస్థితి ఉండేదన్నారు. ఆ పరిస్థితిని పూర్తిగా మార్చామని.. ఆ ప్రాంతానికి శాశ్వత పరిష్కారం చూపించి, రూ.1.83 కోట్లతో అందమైన 'పీఠికాపుర వనం' నిర్మించామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే చెత్త ప్రదేశం స్థానంలో, ఇప్పుడు ఆహ్లాదకరమైన పచ్చదనం, అందమైన వాతావరణం ఏర్పడిందన్నారు.

అంతేకాదు ఉప్పాడ తీర ప్రాంత ప్రజలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కీలక అడుగు ముందుకు పడిందన్నారు పవన్. ఈ సమస్యకు పరిష్కారంగా సుమారు రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు సాధించామన్నారు. ఈ రక్షణ గోడకు సంబంధించిన డిజైన్లు, సర్వేలను ఐఐటీ మద్రాస్ పూర్తి చేసిందని.. ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా మిగిలిన ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఉప్పాడ సముద్ర కోతను అడ్డుకోవడం చాలా కష్టమైన పని అంటూ చాలామంది చెప్పారని.. కానీ ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతగా, అసాధ్యం అనుకున్న పనిని సుసాధ్యం చేసి చూపించానన్నారు పవన్ కళ్యాణ్.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న సహాయం, పునరావాసంపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. చట్టంపై అవగాహన కార్యక్రమాలు, కేసుల విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరును విశ్లేషించారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. కొన్ని జిల్లాల్లో ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు సకాలంలో నష్టపరిహారం, సహాయ పునరావాసం అందేలా చూడాలన్నారు. బాధితులను ఆదుకోవడంలో బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. సొంత తల్లిలా ప్రేమ చూపిన మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని ఆ వర్గాలు ఇప్పటికీ మరిచిపోలేదని పేర్కొంటూ, 25 లక్షల ఎకరాల భూములకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరా గాంధీదని అన్నారు. ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్ధిదారులు ఎస్సీలేనని, ఎస్టీ జనాభా 10 శాతం ఉంటే, వారికి 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని వివరించారు. రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, తద్వారా ఆ వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేయడం ద్వారా దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు చదువు ఒక్కటే అందరి జీవితాలను మారుస్తుందన్న విషయాన్ని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్యలు పరిష్కారం కావని గుర్తుచేశారు.

# శుభకార్యానికి, రాజకీయాలకు లింక్ వద్దు

**అమరావతి, సెప్టెంబర్ 22, అనంతజనశక్తి న్యూస్**

సోషల్ మీడియా వేదికగా తనపై దుష్ప్రచారం జరుగుతోందంటున్నారు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల . తనపై కట్టు కథలు అల్లుతున్నారని.. నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన బిడ్డ పెళ్లిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేసుకునే పరిస్థితి తనకు రాలేదంటూ ట్వీట్ చేశారు షర్మిల. కొద్దిరోజులుగా తాను సోదరుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను కలవబోతున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని.. అన్ని రాజకీయ పార్టీల అధినేతల్ని ఆహ్వానించినట్లుగానే జగన్‌ను కూడా తన కుమార్తె వివాహానికి ఆహ్వానిస్తానన్నారు.

తాను ఎవరినో కలిసినట్లు, ఎక్కడో చేరిపోతున్నట్లు, తన మీద సోషల్ మీడియాలో అల్లుతున్నవి కట్టుకథలు మాత్రమేనన్నారు. ప్రస్తుతం కొందరు చేస్తున్న విశ్లేషణలు పూర్తిగా నిరాధారమని.. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం శుద్ధ అబద్ధమన్నారు. గిట్టని వాళ్ళవి పస లేని ఆరోపణలు చేస్తున్నారని.. ఇది తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించిన సమయంలోనే తాను చివరిసారిగా కలిశానన్నారు. మళ్లీ ఇప్పుడు కలిసినా.. తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందించడానికి మాత్రమేనన్నారు.

తాను సాధారణంగా అన్ని రాజకీయ పార్టీల అధినేతల్ని తన బిడ్డ పెళ్లికి రావాలని, దీవించాలని ఆహ్వానిస్తానన్నారు. ఇందులో కొత్తేం లేదని.. వింత అంతకన్నా కాదననార. కన్న కూతురు వివాహాన్ని అడ్డు పెట్టుకొని తెర వెనుక రాజకీయాలు చేసుకొనే ఖర్మ వైఎస్సార్ బిడ్డగా తనకు లేదన్నారు. శుభకార్యానికి, రాజకీయానికి లింకులు పెట్టి.. తన విశ్వసనీయతను, రాజకీయ ప్రామాణికతను, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. తన బిడ్డ వైఎస్ అంజిలి రెడ్డి సోమల రఘురామ్ రెడ్డి వివాహ మహోత్సవానికి తెలుగు ప్రజలందరూ.. ఒక్కటి కాబోతున్న నవదంపతులకు హృదయ పూర్వక ఆశీస్సులు అందించాలని కోరుతున్నాను అంటూ షర్మిల ట్వీట్ చేశారు.

తన కుమార్తె అంజలిరెడ్డి, రఘురామ్ రెడ్డిలో నిశ్చితార్థం ఈ నెల (సెప్టెంబర్) 24న జరుగుతుందని.. నవంబర్ 25న పరిణయం, అలాగే డిసెంబర్ 5న రిసెప్షన్ వేడుకను నిర్వహించబోతున్నట్లు షర్మిల ప్రకటించారు. ఈ విషయాన్ని తన తండ్రి ఘాట్ దగ్గర అందరితో పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. అంజిలి రెడ్డి, రఘురామ్ రెడ్డిల తొలి వివాహ ఆహ్వాన పత్రికను తన కుటుంబ సభ్యులతో, రఘురామ్ తల్లిదండ్రులతో కలిసి ఇడుపులపాయలోని తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. తన తండ్రి వైఎస్ దీవెనలు బిడ్డల జీవితాలకు కొండంత అండ అన్నారు.

## చిన్న పిల్లల మరణాలకు రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలి


**హైదరాబాద్, సెప్టెంబర్ 22, అనంత జనశక్తి న్యూస్**

అదిలాబాద్ జిల్లా రిమ్స్ హాస్పిటల్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ దుర్ఘటనలో ఇంకా 23 మంది పసిపిల్లలు గాయపడిన నేపథ్యంలో వెంటనే మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడాలన్నారు. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగి, అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని పూర్తిగా విధ్వంసం చేసిన సీఎం రేవంత్ రెడ్డే ఈ సంఘటనకు పూర్తి బాధ్యత వహించాలన్నారు.

రిమ్స్ హాస్పిటల్‌లో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు బీఆర్ఎస్ జిల్లా నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించినా మొద్దునిద్ర పోయిన రేవంత్ సర్కారులో కనీస చలనం కనిపించలేదు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించడం, కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ దవాఖానల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయించి ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రేవంత్ సర్కారు చేతకానితనం వల్ల తమ పసిపిల్లలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



# బాలికపై లైంగిక వేధింపులు.. రాజకీయ దుమారం రేపిన మంత్రి వ్యాఖ్యలు




బిహార్(లోని జముయి జిల్లాలో ఓ అల్లరి మూక బాలికను చుట్టుముట్టి లైంగికంగా వేధించిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. అయితే.. ఈ ఘటనపై బిహార్ మంత్రి శ్రవణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. "ప్రపంచం పూర్తిగా నేర రహితంగా ఉండదు. ఇలాంటి చిన్నచిన్న ఘటనలు అప్పుడప్పుడు జరుగుతూనే ఉంటాయి. వాటిపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది" అని మంత్రి అన్నారు. నిందితులు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నారు. అయితే బాలికకు జరిగిన అన్యాయాన్ని.. చిన్న ఘటనగా పేర్కొనడంపై ప్రతిపక్షాలు ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. మహిళలకు, బాలికలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్‌మండిపడ్డారు.

జముయిలో శనివారం రాత్రి స్నేహితులైన ఇద్దరు టీనేజర్లు.. కోచింగ్ సెంటర్‌కు వెళ్లి వస్తుండగా రోడ్డుపైనే దుండగులు అడ్డగించారు. వారిపై దాడి చేశారు. బాలికను వెంటపడి కొట్టారు. గట్టిగా పట్టుకుని లాక్కెళ్లారు. అభ్యంతరకరంగా తాకారు. ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆ వీడియోల ఆధారంగా ఏడుగురు నిందితులను గుర్తించినట్లు జిల్లా ఎస్పీ బిశ్వజీత్ దయాల్ తెలిపారు. వారిలో ముగ్గురిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. నిందితులందరినీ గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని.. సామాజిక మాధ్యమాల నుంచి ఆ వీడియోను తొలగించాలని ఆదేశించింది.

# 15 గంటలు.. 100కి.మీ ఛేజ్.. కిడ్నాపర్ చెర నుంచి బాలుడు సేఫ్!

గుజరాత్లో కలకలం రేపిన ఓ కిడ్నాప్ కేసులో పోలీసులు ఐదేళ్ల బాలుడిని సురక్షితంగా ఇంటికి చేర్చారు. 15 గంటలు.. 170 ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి.. బాలుడిని తీసుకెళ్లిన వ్యక్తిని 100 కిలోమీటర్ల దూరంలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అమ్రేలీ జిల్లాలోని మోటా అంకాడియా గ్రామంలో ఈ ఘటన జరిగింది. బాలుడి తండ్రి రాకేశ్ మధ్యప్రదేశ్ ) నుంచి వచ్చిన వలస కూలీ. ఆరు నెలల కిందట రాకేశ్ కుటుంబానికి లలిత్ రూప్‌సింగ్‌భాయ్ అనే 25 ఏళ్ల యువకుడు పరిచయమయ్యాడు. పది రోజుల కిందట.. ఆ యువకుడు రాకేశ్ వద్దకు వచ్చి పని దొరికే వరకు తనకు ఆశ్రయం ఇవ్వాలని కోరాడు. దీంతో అతను అంగీకరించి వసతి కల్పించాడు. రాకేశ్ దంపతులు పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా.. లలిత్ వారి కుమారుడిని దిచక్రవాహనంపై ఎక్కించుకుని అక్కడి నుంచి పారిపోయాడు.

అది గమనించిన అతడి తల్లిదండ్రులు ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో గ్రామంలో వెతికి.. చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడి వద్ద ఫోన్ లేకపోవడంతో అతడి కదలికలను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. వాహన నంబర్ ఆధారంగా తనిఖీలు చేపట్టారు. ఆ మార్గంలోని సీసీ టీవీలను పరిశీలించారు. నిందితుడి కదలికలు రాజ్‌కోట్ జిల్లా పరిసర ప్రాంతాల్లో గుర్తించి.. బాలుడిని అతడి నుంచి కాపాడారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ ఎందుకు చేశాడనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.



# చల్లారని బాంబే ఐఐటీ

**- డీన్‌కు మద్దతుగా అధ్యాపకుల ర్యాలీ**

సాహిల్ వాకోడే అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తర్వాత బాంబే ఐఐటీలో మొదలైన ఆందోళన చల్లారడం లేదు. కులవివక్షతో వేధించడం వల్లనే విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడని ఆయన కుటుంబికులు, ఇతర విద్యార్థులు, యువజన కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తూ నిరసనలు కొనసాగిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాల ప్రతినిధులు ఐఐటీ వద్దకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పరిపాలన వ్యవహారాల డీన్ ఆచార్య డి.సూర్యనారాయణను ఆ పదవి నుంచి తప్పించామని, ఇది వెంటనే అమల్లోకి వచ్చిందని యాజమాన్యం ప్రకటించింది. ప్రొఫెసర్‌గా మాత్రం ఆయన కొనసాగుతారు. ఆయన చేసిన కులవివక్ష వ్యాఖ్యలే 22 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్యకు కారణమని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరును చేర్చారు. ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టం కింద, ఆత్మహత్య ప్రేరేపణ నేరం కింద అభియోగాలు మోపారు. సమగ్ర విచారణ జరగకముందే వాకోడే పరువుతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు విమర్శలు రావడంతో ఐఐటీ యాజమాన్యం బహిరంగ క్షమాపణ చెప్పింది. సమాధానాలు




రాసేందుకు చాట్ జీపీటీని ఆశ్రయించి విద్యార్థి పట్టుబడినట్లు తొలుత ప్రకటించిన విషయం తెలిసిందే. డీన్ తొలగింపు విషయాన్ని ఈమెయిల్ ద్వారా బాంబే ఐఐటీ డైరెక్టర్ శిరీశ్ కెదారె విద్యార్థులకు తెలిపారు. సూర్యనారాయణను సస్పెండ్ చేయాలని, పరిపాలన పరమైన పదవి నుంచి తొలగించడం ఒక్కటే సరిపోదని విద్యార్థులు స్పష్టంచేస్తున్నారు. విద్యార్థుల్ని సస్పెండ్ చేస్తామంటూ ఆయన తీవ్ర బెదిరింపులకు పాల్పడేవారని ఆరోపిస్తున్నారు. బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ఉన్న తమ ఏకైక కుమారుడిపై ఆయన కులవివక్ష చూపారని సాహిల్ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తరచూ అవమానాలు, అవహేళనలకు, వేధింపులకు గురిచేయడంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. హాస్టల్‌లో వాతావరణంపైనా దర్యాప్తు జరపాలని విద్యార్థి అమ్మమ్మ శ్యామ్‌లతా తయాడే కోరారు. గేటు బయట నిరసనలు వ్యక్తంచేస్తున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**సూర్యనారాయణ చదివింది నాగార్జున వర్సిటీలో**

సూర్యనారాయణ ఏపీలోని నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి 2000లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తిచేశారు. బాంబే ఐఐటీలో ఎంటెక్, దిల్లీ ఐఐటీ నుంచి పీహెచ్‌డీ చేశాక కొన్నాళ్లు హైదరాబాద్, బెంగళూరుల్లో పనిచేశారు. గత పదేళ్లుగా బాంబే ఐఐటీలో ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగ ఫ్యాకల్టీగా ఉన్నారు. అనేక పరిశోధన ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు. బోధనలోనూ పలు పురస్కారాలు అందుకున్నారు. విద్యాపరమైన, పరిపాలన వ్యవహారాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. బాంబే ఐఐటీ ఫ్యాకల్టీ ఫోరం ఆయనకు మద్దతు ప్రకటించింది. విద్యార్థి విషయంలో ఒక ఇన్విజిలేటర్‌గా నిర్దేశిత కర్తవ్యాన్ని ఆయన నిర్వర్తించారని, దానిలో ఎలాంటి తప్పు లేదని ఐఐటీ ఫ్యాకల్టీ ఫోరం స్పష్టంచేస్తోంది. సూర్యనారాయణకు మద్దతుగా ఫ్యాకల్టీ సభ్యులు సోమవారం సాయంత్రం ఐఐటీ ప్రాంగణంలో ప్రదర్శన నిర్వహించారు. సరైన ఆధారాల్లేకుండా ఆయనపై ఆరోపణలు చేస్తున్నారని వారు అభ్యంతరం తెలిపారు. ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించడాన్ని సహించబోమని స్పష్టంచేశారు.

# రామాలయంలో విరాళాల చోరీ.. సీసీటీవీలో 105 సార్లు నమోదు

**- సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో సిట్ వెల్లడి**

అయోధ్య రామాలయంలో భక్తుల విరాళాల చోరీపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన స్థాయీ నివేదికను సుప్రీంకోర్టు సమీక్షించింది. చోరీ దృశ్యాలు సీసీటీవీలో 105 సార్లు నమోదైనట్లు వెల్లడైంది. సిట్ దర్యాప్తు చివరి దశకు వచ్చిందని, ఈ నెల 25కల్లా ఛార్జిషీటు దాఖలు చేయనున్నట్లు సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా సోమవారం విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహన ధర్మాసనానికి తెలిపారు. చట్ట నిబంధనల ప్రకారం ఛార్జిషీటుపై చర్యలు తీసుకోవాలని మేజిస్ట్రేట్‌ను ధర్మాసనం ఆదేశించింది.

**సీఈవో బాధ్యతల స్వీకరణ**

అయోధ్య: రామాలయ పాలనావ్యవహారాలను పర్యవేక్షించే శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తొలి సీఈవోగా నియమితులైన రిటైర్డ్ ఎయిర్‌మార్షల్ జితేంద్ర మిశ్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయోధ్య రామాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన తన కార్యాలయంలోకి వెళ్లడానికి ముందు ఆయన ఆలయంలో పూజలు నిర్వహించారు.



# బిహార్ నుంచే అత్యధిక ఐఏఎస్‌లు.. అయినా ఎందుకీ ఘోరాలు: ఖుష్బూ పటానీ



బిహార్‌లోని జముయిా జిల్లాలో కోచింగ్‌కు వెళ్లి వస్తున్న ఇద్దరు టీనేజర్లపై కొందరు దుండగుల దాష్టీకం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటనపై హీరోయిన్ దిశా పటానీ సోదరి, మాజీ ఆర్మీ అధికారి ఖుష్బూ పటానీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిహార్ ప్రజలు ఇప్పటికైనా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళల భద్రతపై అధికారులను నిలదీయాలన్నారు. బిహార్ నుంచే అత్యధిక ఐఏఎస్‌లు వస్తున్నా..ఆ రాష్ట్రంలో ఇంకా ఎందుకీ ఘోరాలు జరుగుతున్నాయని ప్రశ్నించారు.

''భారత్ ఒక గొప్ప దేశంగా, విశ్వగురువుగా ఎదగాలని నేతలందరూ కోరుకుంటారు.

మహిళలకు ఏమాత్రం గౌరవం లేనప్పుడు అదెలా సాధ్యమవుతుంది? మీరు బిహార్ కేసు చూసే ఉంటారు. కొందరు దుర్మార్గులు బాలిక పట్ల దారుణంగా వ్యవహరించారు. మత్తులో మునిగి తేలే చదువు లేని అజ్ఞానులు.. కొందరి చేతుల్లో పావులుగా మారి, ఇటువంటి పనులు చేస్తున్నారు. కోచింగ్ సెంటర్‌కు వెళ్లి వస్తున్న విద్యార్థులను అడ్డుకొని, హింసాత్మకంగా ప్రవర్తించిన తీరు చూస్తేనే.. వారు ఎంత క్రూరమైన వారో అర్థమవుతోంది. అత్యధిక ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బిహార్ నుంచే వస్తుంటే.. మన శాంతిభద్రతల వ్యవస్థ ఎందుకు కుప్పకూలింది? అమ్మాయిల జోలికి వచ్చిన వారికి కఠినమైన శిక్షలు విధించాలి' అని ఖుష్బూ పటానీ డిమాండ్ చేశారు.

**ఏమి జరిగిందంటే..?**

**శనివారం రాత్రి స్నేహితులైన ఇద్దరు టీనేజర్లు.. కోచింగ్ సెంటర్‌కు వెళ్లి వస్తుండగా రోడ్డుపైనే దుండగులు అడ్డగించారు. వారిపై దాడి చేశారు. బాలికను వెంటపడి కొట్టారు. గట్టిగా పట్టుకుని లాక్కెళ్లారు. అభ్యంతరకరంగా తాకారు. వారు దుండగుల నుంచి విడిపించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వీడియో సోమవారం వైరలైంది. వెంటనే స్పందించిన పోలీసులు సుమోటోగా పోక్సో కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో కీలక నిందితుడు నందన్ యాదవ్‌ను పట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగా అతడు పారిపోవడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నిందితుడి కాలికి గాయాలైనట్లు తెలిపారు.**


# నదిలో 5కి.మీ కొట్టుకుపోయిన ఏనుగు పిల్ల.. కాపాడిన మత్స్యకారులు



తల్లి నుంచి తప్పిపోయిన ఓ ఏనుగు పిల్ల ప్రమాదవశాత్తు నదిలో పడిపోయింది. గమనించిన మత్స్యకారులు కొన్ని గంటల పాటు శ్రమించి దానిని కాపాడారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్ లోని జల్పాయిగురి జిల్లాలోని బైకంఠపూర్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. అటవీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..

బైకంఠపూర్ అటవీ ప్రాంతంలో ఓ ఏనుగుల గుంపు తీస్తా నదిని దాటుతుండగా.. నాలుగు రోజుల వయసున్న ఏనుగు పిల్ల తప్పిపోయింది. ఆ సమయంలో నదిలో వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో దాదాపు 5 కి.మీ మేర కొట్టుకుపోయింది. నీటిలో కొట్టుకుపోతున్న ఈ పిల్ల ఏనుగును గమనించిన కొందరు మత్స్యకారులు తీవ్రంగా శ్రమించి, దానిని సురక్షితంగా పడవలోకి ఎక్కించారు. అటవీ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఏనుగు పిల్లను తమ సంరక్షణలోకి తీసుకున్నారు. అనంతరం తల్లి ఏనుగు జాడ తెలుసుకున్న అధికారులు ఏనుగు పిల్లను దానివద్దకు చేర్చారు.

# కావేరీ జలాల వివాదం.. సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు




తమిళనాడుకర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. కర్ణాటకకు 70 టీఎంసీల నీరు అదనంగా కేటాయించాలని కోరుతూ ఒక ప్రైవేటు సంస్థ వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రైవేటు సొసైటీల పిటిషన్లు చెల్లవని స్పష్టం చేసింది.

అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ పార్టీలు లేక సొసైటీలు జోక్యం చేసుకోలేవని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఇలాంటి పిటిషన్లను విచారిస్తూ పోతే.. వివాదాలు ఇంకెప్పటికి ముగుస్తాయని ప్రశ్నించింది. ఇప్పటికే కావేరీ జలాలపై తమిళనాడు, కర్ణాటక చట్టపరంగా పోరాడుతున్నాయని పేర్కొంది. ఈ వివాదంలో ప్రైవేటు సొసైటీలకు స్థానం లేదని.. రాష్ట్రాలకే మాట్లాడే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది.

తమిళనాడుకు 15 రోజుల పాటు రోజూ 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ నదీ జలాల నిర్వహణ అథారిటీ జులై 28న కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. కావేరీ బేసిన్‌లోని నీటి లభ్యత, వర్షపాత పరిస్థితులను సమీక్షించిన తర్వాత ఈ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన కరవు పరిస్థితులు నెలకొనడంతో.. తమిళనాడుకు కావేరీ జలాల విడుదలను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు, కన్నడ సంఘాలు నిరసనలు చేశాయి. ఆ నేపథ్యంలో తమిళనాడులోని విజయ్ సర్కార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

# మలేసియాకు వీసా ఫ్రీ ట్రావెల్.. పౌరులకు భారత హైకమిషన్ అడ్వైజరీ



మలేసియా వచ్చే భారత ప్రయాణికులకు కౌలాలంపూర్‌లోని భారత హైకమిషన్ కీలక సూచన చేసింది. మలేసియా అందిస్తున్న 30 రోజుల వీసా ఫ్రీ ట్రావెల్‌ను దుర్వినియోగం చేయొద్దని సూచించింది. దాన్ని ఉపాధి అవకాశాల కోసం వినియోగించొద్దని పేర్కొంది. నకిలీ జాబ్ ఆఫర్లతో మలేసియాకు వస్తోన్న భారతీయుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ మేరకు అడ్వైజరీ జారీ చేసింది. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు ఏజెంట్లు నిరుద్యోగులకు వల వేస్తున్నారని, వారి చేతిలో చాలా మంది మోసపోతున్నారని హైకమిషన్ తన అడ్వైజరీలో పేర్కొంది. పర్యాటక లేదా వీసా ఫ్రీ ట్రావెల్‌పై వచ్చి ఇక్కడ గడువుకు మించి ఉండిపోతున్నారని, దీంతో చట్టపరంగా చర్యలు ఎదుర్కొంటున్నారని తెలిపింది. భారత పాస్‌పోర్ట్ కలిగిన వారికి ఇస్తున్న 30 రోజుల వీసా రహిత ప్రవేశం కేవలం పర్యాటకం, సామాజిక సందర్శన కోసం ఉద్దేశించినది మాత్రమేనని భారత హైకమిషన్ తెలిపింది. దీన్ని ఉపాధి అవసరాల కోసం వినియోగించడం మలేసియా వలస నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. కాబట్టి వర్క్ పర్మిట్ లేకుండా మలేసియాకు రావొద్దని సూచించింది. అలాగే, మలేసియా వచ్చే సాధారణ ప్రయాణికులు సైతం రిటర్న్ టికెట్, హోటల్ బుకింగ్ వంటి ట్రావెల్ ప్రణాళికతో రావడం వల్ల ఇమిగ్రేషన్ ఇబ్బందులు తలెత్తవని పేర్కొంది. పాస్‌పోర్టు వ్యాలిడిటీ కూడా కనీసం 6 నెలలు చెల్లుబాటులో ఉండేవిధంగా ఉండాలని సూచించింది. మలేసియా ఈ ఏడాది చివరి వరకు భారత పౌరులకు వీసా ఫ్రీ ట్రావెల్ సదుపాయాన్ని అందిస్తోంది.

# ఆ నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు 'నో పెట్రోల్'

చెల్లుబాటు అయ్యే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై పంజాబ్‌లోని అమృత్‌సర్ పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. ఈ తరహా నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు ఏ పెట్రోల్ బంక్‌లోనూ పెట్రోల్, డీజిల్ గానీ, సీఎన్‌జీ గానీ సరఫరా చేయబోమని నగర పోలీస్ కమిషనర్ హర్మన్‌బీర్ సింగ్ గిల్ వెల్లడించారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. వాహనానికి ముందు, వెనక భాగాల్లో సరిగ్గా అమర్చిన, చెల్లుబాటయ్యే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు ఉండాల్సిందేనని సీపీ స్పష్టం చేశారు. అయితే, తాత్కాలిక నంబర్లు కలిగిన వాహనాలు, అంబులెన్సులు, ఫైరింజన్లు, ఇతర అత్యవసర సేవలందించే వాటికి మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు.

అలాగే, ఫ్యూయల్ స్టేషన్ల వద్ద సంబంధిత సమాచార బోర్డులను ఆంగ్లం, పంజాబీ భాషల్లో ఉంచాలని పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు. అంతేకాకుండా అన్ని పెట్రోల్‌బంకుల వద్ద సీసీటీవీ కెమెరాలు పనిచేసేలా ఉండాలని, వచ్చి, పోయే వాహనాల నంబర్ ప్లేట్లను రికార్డు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఫుటేజీని కనీసం 30 రోజుల పాటు భద్రపరచాలని బంక్ యజమానులకు సూచించారు. పెట్రోల్ విక్రయించేందుకు నిరాకరించారని ఎవరైనా గొడవకు దిగితే తక్షణమే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. నవంబర్ 20వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.



# రోడ్డు రవాణాపై సమస్యల జడివాన

భారత అభివృద్ధి ప్రయాణానికి రహదారులే ఆధారం. దేశ సరకు రవాణాలో దాదాపు 65-70 శాతం రోడ్డు ద్వారానే జరుగుతోంది. ఉత్పత్తిదారులను వినియోగదారులతో అనుసంధానిస్తూ కోట్లమందికి జీవనోపాధిని అందిస్తున్న ఈ రంగానికి అవసరమైన మద్దతు కొరవడుతోంది. మౌలిక సదుపాయాలు, వ్యయ నియంత్రణ తదితర సమస్యలపై తక్షణం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

మన దేశం ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా ఎదగాలన్నా, లాజిస్టిక్స్ వ్యయాలను తగ్గించాలన్నా రోడ్డు రవాణా రంగాన్ని బలోపేతం చేయాల్సిందే. దేశంలో ట్రక్కులు రోజుకు సగటున కేవలం 250-400 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తున్నాయి. ఈ విషయంలో ప్రపంచ ప్రమాణం రోజుకు 500-700 కిలోమీటర్లుగా ఉంది. ఈ వ్యత్యాసానికి డిమాండ్ లేకపోవడం కారణం కాదు. వ్యవస్థాగత లోపాలు, రవాణా ప్రక్రియలోని బలహీనతల వల్లే మనం వెనకంజ వేయాల్సి వస్తోంది. రోడ్డు రవాణా రంగం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో డ్రైవర్ల కొరత ముఖ్యమైంది. దేశంలో 20 లక్షలకుపైగా ట్రక్ డ్రైవర్ల కొరత ఉన్నట్లు అంచనా. ప్రతి వంద ట్రక్కులకు కేవలం 55-60 మంది డ్రైవర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఫలితంగా గణనీయమైన సంఖ్యలో వాహనాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. సుదూర ప్రాంతాలకు రవాణా చేసే డ్రైవర్లు నెలలో 20-25 రోజులదాకా ఇంటికి దూరంగా, ఒత్తిడితో కూడిన, సురక్షితం కాని పరిస్థితుల్లో పని-చేస్తుంటారు. సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, పెన్షన్ వంటి ప్రయోజనాలు లేకపోవడంతో యువత ఈ వృత్తి వైపు మొగ్గడం లేదు. దీంతో నైపుణ్యం కలిగిన డ్రైవర్లకు డిమాండ్, సరఫరా మధ్య అంతరం పెరుగుతోంది. డ్రైవర్లకు కనీస గౌరవం, సంక్షేమం కల్పించకపోవడం పెద్ద సమస్య. జాతీయ రహదారుల వెంట సరైన విశ్రాంతి కేంద్రాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సురక్షిత పార్కింగ్ ప్రాంతాలు కొరవడుతున్నాయి. తాగునీరు, వైద్య సహాయం వంటి సౌకర్యాలూ ఉండటం లేదు. ఇది వారి ఆరోగ్యం, సంక్షేమంపై ప్రభావం చూపుతూ, రోడ్డు ప్రమాదాలకు, ఉత్పాదకత తగ్గుదలకు దారితీస్తోంది.

వ్యయ భారం

రవాణా రంగంలోని ఆపరేటర్లు మానవ వనరుల సమస్యలతో పాటు పెరుగుతున్న వ్యయాల భారాన్నీ ఎదుర్కొంటున్నారు. ట్రక్కుల నిర్వహణ వ్యయంలో 40 శాతానికి పైగా వాటా డీజిల్‌దే. ఇంధన ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. మొత్తం నిర్వహణ వ్యయంలో దాదాపు 6-7శాతం టోల్ చెల్లింపులకే వెళ్తోంది. సుదూర ప్రాంతాలకు సరకు రవాణా చేసే ఆపరేటర్లు ప్రతిరోజూ భారీమొత్తంలో టోల్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి ప్రత్యక్ష వ్యయాలతో పాటు సంక్లిష్టమైన పన్నులు, అనుమతులు, నిబంధనలు వేధిస్తున్నాయి. రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో రోడ్డు పన్నులు, పర్మిట్లు, జీఎస్టీ, బీమా ప్రీమియం, వాహన ఛార్జీలు వంటి అనేక వ్యయాలు భారమవుతున్నాయి. మూడొంతులు చిన్న ఫ్లీట్ యజమానులే ఉండటంతో అధిక వ్యయాలు లాభాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటికీ, రాష్ట్రాల మధ్య సరకు రవాణా ఇప్పటికీ అస్తవ్యస్త విధానాలు, సమన్వయ లోపాల కారణంగా ప్రభావితమవుతోంది. వాహన్ వంటి డిజిటల్ వేదికలు మంచి ఉద్దేశంతోనే ప్రారంభమైనా- డేటా కచ్చితత్వం, దేశవ్యాప్తంగా ఏకరీతి అమలుకు సంబంధించిన సమస్యలు కొనసాగుతున్నాయి. తప్పుడు జరిమానాలు, పారదర్శకత లేమిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ, నగర ప్రాంతాల్లో సమయ పరిమితులు, పరిమిత అన్‌లోడింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ రద్దీ వంటి సమస్యలతో వాహనాల వినియోగ సామర్థ్యం తగ్గి, వ్యయాలు పెరుగుతున్నాయి. ప్రత్యేక ట్రక్ టెర్మినల్స్, లాజిస్టిక్స్ పార్కులు, పార్కింగ్ సదుపాయాల కొరత సైతం వేధిస్తోంది.

బహుళ రవాణా విధానాలతో కూడిన లాజిస్టిక్స్ వ్యవస్థ అభివృద్ధికి అవసరమే. కానీ, రోడ్డు రవాణా రంగాన్ని బలోపేతం చేయడం ద్వారానే ఆ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. వివిధ రవాణా మార్గాలను అనుసంధానించే కీలక లింక్‌గా రోడ్లే పనిచేస్తాయి. జాతీయ లాజిస్టిక్స్ విధానం, పీఎంగతిశక్తి వంటి విధానాలు ఈ రంగంలో సంస్కరణలకు బలమైన పునాది వేశాయి. అయితే వాటి అమలు ప్రభుత్వంలోని వివిధ స్థాయుల మధ్య సమన్వయంపై ఆధారపడి ఉంటుంది. రవాణాదారుల కోసం సమర్థమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ లేకపోవడం ముఖ్యమైన సంస్థాగత లోపం. తక్షణమే దృష్టి సారించాల్సిన సమస్య ఇది. ట్రాన్స్‌పోర్టు అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పరిస్తే- వివాదాల పరిష్కారానికి అధికారిక వేదిక అందుబాటులోకి వచ్చి జవాబుదారీతనం పెరుగుతుంది. వారాల తరబడి రహదారులపై ప్రయాణించే డ్రైవర్, పెరుగుతున్న వ్యయాలతో పోరాడుతున్న చిన్న ఫ్లీట్ యజమాని, సంక్లిష్టమైన నిబంధనల మధ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న రవాణాదారు వంటివారంతా దేశ ఆర్థికాభివృద్ధి పథంలో అంతర్భాగమైన వాళ్లకు మద్దతు ఇవ్వడాన్ని జాతీయ ప్రాధాన్యాంశంగా భావించాలి.


సమగ్ర సంస్కరణలు అవసరం

దేశంలో రోడ్డు రవాణా రంగాన్ని బలోపేతం చేయడానికి సమగ్ర సంస్కరణలతో కూడిన కార్యాచరణ అవసరం. మానవ వనరుల సమస్యలను పరిష్కరించకుండా, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులతోనే ఆశించిన ఫలితాలు దక్కవు. ముఖ్యంగా, డ్రైవర్ల కేంద్రంగా విధానాలు రూపొందించాలి. విశ్రాంతి కేంద్రాల ఏర్పాటు, ఆరోగ్య సంరక్షణ, బీమా కల్పనతో డ్రైవర్ల సామాజిక గౌరవాన్ని పెంచే చర్యలు తీసుకోవాలి. వ్యయ నియంత్రణ కూడా ముఖ్యమే. టోల్ నిర్మాణం, ఇంధన పన్నులు, పర్మిట్ వ్యవస్థలను సమీక్షించడం ద్వారా రవాణాదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చు. నిబంధనల అమలు ప్రక్రియలను సరళీకరించడం ద్వారా చిన్న ఆపరేటర్లకు వ్యాపార నిర్వహణ సులభతరమవుతుంది. లాజిస్టిక్స్ పార్కులు, గిడ్డంగుల సదుపాయాలు, ప్రత్యేక పార్కింగ్ జోన్ల ఏర్పాటు సాగాలి. డిజిటల్ వేదికలను బలోపేతం చేసి, రాష్ట్రాల మధ్య ఏకరీతి నిబంధనల అమలు పారదర్శకంగా జరిగేలా చూడాలి. రోడ్డు రవాణా కేంద్రంగా రైల్వేలు, ఓడరేవులు, అంతర్గత జలమార్గాలను సమర్థంగా అనుసంధానించాలి. ట్రక్కుల చక్రాలు వేగంగా కదిలితేనే, దేశాభివృద్ధి వడివడిగా దౌడు తీస్తుంది. ఈ విషయాన్ని ప్రభుత్వాలు సదా గుర్తుంచుకోవాలి.



## మాదకద్రవ్యాలకు వద్దు అని చెబుదాం..

# జీవితాన్ని స్వాగతిద్దాం



## నషా ముక్త్ భారత్ అభియాన్‌కు ఆరు సంవత్సరాలు

దాదాపు ప్రతి కాలేజీ హాస్టల్‌లో, ప్రతి ఆఫీస్ పార్టీలో, పెరుగుతున్న ప్రతి స్నేహితుల బృందంలో కొందరు మాదక ద్రవ్యాలను ఒకరి నుండి మరొకరికి అందిస్తూ ఉండే దృశ్యం తరచుగా కనిపిస్తుంది. అటువంటప్పుడు ఆ ప్రదేశంలో సాధారణంగా మాట్లాడుతున్నట్లుగానే, కానీ కాస్త గట్టిగా వినిపించే మాట — "ఇక్కడ అందరూ ఇదే చేస్తున్నారు" అని. అలాంటి సమయంలో "వద్దు" అని చెప్పడం అంటే మన స్నేహితుల బృందం నుంచి బయటకు వచ్చినట్లుగా అనిపించవచ్చు. ఆ తర్వాత కొద్దిసేపు నిశ్శబ్దం ఏర్పడుతుంది. ఆ సమయంలో ఒక వ్యక్తి తన స్నేహితుల ఒత్తిడికి "వద్దు" అని చెబితే కలిగే ఇబ్బందిని, అందరి మధ్య తాను ప్రత్యేకంగా కనిపిస్తే కలిగే అసౌకర్యం గురించి త్వరగా ఆలోచిస్తారు. నిజానికి అదే ఒక నిర్ణయాత్మకమైన క్షణం. ఎందుకంటే వ్యసనం ఎప్పుడూ ఒకరి స్పష్టమైన నిర్ణయంతోనే మొదలవదు. చాలాసార్లు ఇతరుల బృందంలో తాను ఒంటరిగా మిగిలిపోతాననే భయం వల్లే అది మొదలవుతుంది.

మాదకద్రవ్యాలు వద్దు, జీవితమే ముద్దు

ఇలాంటి నిశ్శబ్దమైన, కానీ చాలా ముఖ్యమైన సమయంలోనే నషా ముక్త్ భారత్ అభియాన్ (NMBA) ప్రభావం చూపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మాదక పదార్థాల దుర్వినియోగం వల్ల కలిగే సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. అంతకంటే ముఖ్యంగా, మాదక పదార్థాలకు "వద్దు" అని చెప్పే నిర్ణయం తీసుకోవడం, దాన్ని ధైర్యంగా చెప్పడం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడం సహజమైన విషయంగా మారేలా సమాజంలో మార్పు తీసుకురావడం దీని ముఖ్య లక్ష్యం.

దృఢమైన సంకల్పం

2020 ఆగస్టు 15న గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ప్రచార కార్యక్రమంలో, NMBA (నేషనల్ నషా ముక్త్ యువ అభియాన్) మరింత సవాలుతో కూడిన అంశంపై పోరాడాలని నిర్ణయించుకుంది. బలహీనమైన క్షణంలో, తన చుట్టూ ఉన్న స్నేహితుల బృందం ముందు ధైర్యంగా 'వద్దు' అని చెప్పగలిగే ఒక వ్యక్తి సంకల్పమే ఆ సవాలు.

అందుకే ఈ ప్రచారంలో అత్యంత శక్తివంతమైన పదం బహుశా అత్యంత సరళమైనదే కావచ్చు— 'వద్దు!' అది నాటకీయంగా చెప్పే 'వద్దు!' కాదు. నైతిక విలువలపై ఉపన్యాసం కాదు. చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరూ 'అవును' అంటున్నట్లు అనిపించినప్పుడు, తిరస్కరించే ఆత్మవిశ్వాసం మాత్రమే.

గౌరవనీయ ప్రధానమంత్రి ఇలా అన్నారు: "వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ కోసం 'నషా ముక్త్ యువ' అనే పేరే మన సంకల్పాన్ని స్పష్టం చేస్తుంది. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న నేపథ్యంలో, మన యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో, మాదకద్రవ్యాల వంటి ప్రాణాంతక అలవాట్లకు ఎల్లప్పుడూ దూరంగా ఉండటం ఎంతో అవసరం. ఇదే ఈ ప్రచార కార్యక్రమం లక్ష్యం. వ్యసనం వల్ల కలిగే ప్రమాదాలను మన యువత అర్థం చేసుకునేలా, అప్రమత్తంగా ఉండేలా, దానికి దూరంగా ఉండేలా మనమందరం సంకల్పం చేసుకోవాలి. ఈ సంకల్పాన్ని నెరవేర్చడంలో నేషనల్ నషా ముక్త్ యువ అభియాన్ ఇప్పుడు కీలక పాత్ర పోషిస్తోంది."

ఎన్ఎంబీఏ: అందరి బాధ్యతతో దేశవ్యాప్తంగా సాగుతున్న ఉద్యమం

ఆరు సంవత్సరాల తర్వాత, ఒక వ్యక్తి తీసుకున్న ఆ చిన్న నిర్ణయం ఇప్పుడు మరింత పెద్ద ఉద్యమంలో భాగంగా మారింది. ఈ కార్యక్రమం ప్రతిజ్ఞలు, ప్రజల భాగస్వామ్యం ద్వారా 13.71 కోట్లకు పైగా యువతకు చేరింది. పాఠశాలలు, కాలేజీలు, గ్రామాలు, ఇతర సమాజాల్లో 31 లక్షలకు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

కాలేజీల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయడం సాధారణ విషయంగా మారింది. గ్రామ సభల్లోనూ ఈ అంశంపై చర్చించడం సాధారణ కార్యక్రమంగా మారింది.

ఒకప్పుడు కుటుంబాలు తమ సభ్యుల మాదక ద్రవ్యాల వ్యసనం గురించి బయటకు చెప్పడానికి సిగ్గుపడేవి. ఇప్పుడు 10.65 కోట్లకు పైగా మహిళలు, స్వయం సహాయక సంఘాలు (SHGs), సామాజిక సంస్థల సహకారంతో ఈ సమస్య గురించి బహిరంగంగా మాట్లాడుతున్నారు. తమకు తెలిసిన భాషలో, తమ చుట్టూ ఉన్న ప్రజలతో ఈ విషయం గురించి అవగాహన కల్పిస్తున్నారు.

1.70 లక్షలకు పైగా నషా ముక్తి మిత్రులు (ఎన్ఎంఎమ్): సమాజ స్థాయిలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ముఖ్య వ్యక్తులుగా ముందుకు వచ్చారు. 2026 సెప్టెంబర్ 19 నాటికి, ఈ సందేశం 34.57 కోట్లకు పైగా ప్రజలకు చేరింది. ఇక్కడే ఒక ప్రజా కార్యక్రమం సమాజంలోని ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడం ప్రారంభిస్తుంది. ఎన్ఎంబీఏ కేవలం ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి, సమాచారం తెలుసుకోవడానికి, దాని సందేశాన్ని ఇతరులకు చేరవేయడానికి అనేక మార్గాలను ఏర్పరచింది.

ఎన్ఎంబీఏ పోర్టల్లో కార్యక్రమానికి సంబంధించిన సమాచారం, విద్యా విషయాలు, అమలులో ఉపయోగపడే మంచి పద్ధతులు, ప్రజలు ఈ అభియాన్‌లో భాగస్వాములు అయ్యే అవకాశాలు ఒకే చోట అందుబాటులో ఉన్నాయి.

https://www.dosje.gov.in/organisation/nashamuktbharatabhiyaan

మాదకద్రవ్య రహిత యువత – మాదకద్రవ్య రహిత భారత్

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 137వ ఎపిసోడ్‌లో ఈ ప్రధాన లక్ష్యం గురించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే యువత, మాదక ద్రవ్య రహిత భారత్ అనే లక్ష్యాన్ని సాధించేందుకు మరోసారి ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ సందేశం కేవలం ప్రభుత్వ సంస్థలు, అమలు చేసే సంస్థలకే పరిమితం కాకుండా యువ సంగీత కళాకారులు, విద్యార్థులు, నాటక బృందాలకు చేరింది. యువత ఇప్పటికే విశ్వసించే వ్యక్తుల గొంతు ద్వారా సందేశాలు చేరినప్పుడు అవి మరింత ప్రభావవంతంగా ఉంటాయని ఈ పిలుపు గుర్తించింది.

అంటే, గత ఆరు సంవత్సరాల్లో ఎన్ఎంబీఏ నిశ్శబ్దంగా నిర్మించినది ఇదే. మాదక ద్రవ్యాలను అడ్డుకునే ఒక గోడను నిర్మించడం మాత్రమే కాదు, వాటికి దూరంగా ఉండేలా ప్రజలకు మరో మంచి సామాజిక వాతావరణాన్ని ఏర్పరచడం. ఇప్పుడు ఈ కార్యక్రమం ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతానికి చేరేంతగా విస్తరించింది.


పాఠశాలలు, కాలేజీలు, పంచాయతీరాజ్ సంస్థలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ నెట్‌వర్క్‌లు, వేలాది సామాజిక సంస్థల వరకు ఈ కార్యక్రమం చేరింది. వీటిలో ప్రతి సంస్థ తమకు అర్థమయ్యే విధంగా, తమ మాటల్లోనే ఒకే సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది.

అవగాహన నుంచి పరిష్కారం దిశగా

ఇంత పెద్ద స్థాయిలో సాగుతున్న ఉద్యమం కేవలం గణాంకాలకే పరిమితం కాదు. ఇది క్రమంగా ఇళ్లలో, తరగతి గదుల్లో, సమాజంలో జరిగే చర్చలను ప్రభావితం చేస్తుంది. మాదక ద్రవ్యాల దుర్వినియోగం గురించి ప్రజలు బహిరంగంగా మాట్లాడేలా చేస్తుంది. సమస్య తీవ్రమైన సమయంలో మాత్రమే మాట్లాడే అంశంగా కాకుండా, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యత అనే భావనను పెంచుతుంది.

అయితే అవగాహన కల్పించడం మొదటి అడుగు మాత్రమే. తమకు లేదా తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో ఎవరికైనా సహాయం అవసరమైనప్పుడు, "సహాయం కోసం ఎక్కడికి వెళ్లాలి?" అనే ప్రశ్న వస్తుంది. ఈ తదుపరి అడుగును సులభం చేయడానికి ఎన్ఎంబీఏ ప్రయత్నించింది.

జాతీయ డీఅడిక్షన్ హెల్ప్‌లైన్ 14446 సమాచారం, మార్గదర్శకత్వం, సరైన మాదకద్రవ్యాల విముక్తి సేవలకు సూచన అందించే సంప్రదింపు కేంద్రంగా పనిచేస్తుంది. ఆందోళన కలిగిన సమయంలో సరైన సహాయం పొందేందుకు ఇది మొదటి అడుగుగా మారే అవకాశం కల్పిస్తుంది.



శ్రీ సుధాన్ష్ పంత్
(రచయిత: భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మరియు సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి)

ఎప్పుడైనా ఒక స్నేహితుడు మాదకద్రవ్యాలు తీసుకోమని ఒత్తిడి చేసినప్పుడు, మనకు అది సరైనది కాదని తెలిసినా, ఏం చేయాలో తడబడిన ప్రతి వ్యక్తికి ఎన్ఎంబీఏ ప్రయాణం ఒక ధైర్యాన్ని ఇస్తుంది. ఇలాంటి పరిస్థితిలో తాము ఒంటరిగా లేమనే నమ్మకాన్ని కలిగిస్తుంది.

2020లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు దేశవ్యాప్తంగా సాగుతున్న పెద్ద ఉద్యమంగా మారింది. యువత, కుటుంబాలు, సమాజాలు, వివిధ సంస్థలను ఒకే లక్ష్యం కోసం కలుపుతోంది.

యువతను సంరక్షణకు సంయుక్తంగా అందరం - భారతదేశానికి మార్గదర్శకమైన యువత

ఇప్పుడు ప్రతి పౌరుడు ఈ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశం కలిగి ఉన్నారు. వారు "నషా ముక్తి మిత్రులు" గా మారి, ఈ అంశంపై జరిగే చర్చలను కేవలం ప్రచార కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రతిరోజూ మన జీవితంలో నిర్ణయాలు తీసుకునే ప్రదేశాలకు తీసుకెళ్లవచ్చు.

ఎందుకంటే దీర్ఘకాలిక మార్పు ఒక్క ప్రచారం, ఒక్క సంస్థ లేదా ఒక్క సందర్భం వల్ల మాత్రమే రాదు. అవగాహన రోజువారీ చర్చగా మారినప్పుడు, ఆ చర్చ అందరి సంకల్పంగా మారినప్పుడు, ఆ సంకల్పం మన రోజువారీ జీవితంలో అమలైనప్పుడు ఆ మార్పు కొనసాగుతుంది.

ఇదే నషా ముక్త్ భారత్ అభియాన్ యొక్క సామర్థ్యం, ప్రభావం. ఇది మాదక పదార్థాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సాగుతున్న కార్యక్రమం. ఈ లక్ష్యం కోసం దేశ ప్రజలంతా కలిసి నిలబడుతున్నారు.

యువతను రక్షించేందుకు మనమంతా చేతులు కలుపుదాం - భారతదేశానికి మార్గదర్శకమైన యువతను కాపాడుదాం.

# స్థానిక సంస్థల ఎన్నికలకు...

**పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఒక కొత్త అధ్యాయాన్ని ఆరంభించింది. రాష్ట్రంలోని నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలలోని చైర్‌పర్సన్‌లు, మేయర్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు జరపాలని ఆగస్టు 18న శాసనసభలో ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005 వరకు ప్రత్యక్ష ఎన్నిక విధానం ద్వారా ప్రజలే నేరుగా చైర్‌పర్సన్, మేయర్‌లను ఎన్నుకొనేవారు. తరువాత పరోక్ష పద్ధతి ద్వారా వారిని ఎన్నుకుంటున్నారు. మారుతున్న ఓటర్ల, రాజకీయ నాయకుల అభిప్రాయాలకు అనుగుణంగా ప్రస్తుత చట్టానికి సవరణలు తెచ్చి, ప్రత్యక్ష పద్ధతి ద్వారానే ఎన్నికలు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపింది.**



చైర్‌పర్సన్, మేయర్‌లను ఓటర్లే నేరుగా ఎన్నుకొనే విధానం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. నాయకుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి కుక్కల సమస్యలపై సాకులు చెప్పటానికి అవకాశం ఉండదు. ఐదు సంవత్సరాల స్థిరమైన; బలమైన పదవీకాలం ఉంటుంది. పార్టీలు మారినా, కౌన్సిల్, కార్పొరేషన్‌లో గ్రూపులు మారినా చైర్‌పర్సన్/మేయర్ పదవికి ఎటువంటి ప్రమాదం ఉండదు. దీంతో దీర్ఘకాలిక ప్రణాళికలు, స్మార్ట్ సిటీ లాంటి పథకాలు పక్కాగా, వేగంగా అమలు జరుగుతాయి. ప్రస్తుతం చైర్‌పర్సన్/మేయర్ సీటు కోసం కోట్లు ఖర్చు చేసి వార్డ్ మెంబర్లను, కార్పొరేటర్లను కొనాల్సి వస్తోంది. ప్రత్యక్ష ఎన్నిక విధానం వస్తే ఆ ఆరోపణలు చాలా వరకు తగ్గుతాయి. ముఖ్యంగా, ఎన్నికలు అయ్యాక అవిశ్వాస తీర్మానం పెట్టి చైర్‌పర్సన్/మేయర్‌ను పదవిలోంచి దించేస్తారనే భయం ఉండదు. దాంతో పూర్తి పదవీకాలం ఆందోళనరహితంగా పనిచేసుకునే అవకాశం ఉంటుంది.

లాభాలతో పాటు నష్టాలు లేదా సవాళ్లు కూడా ఉంటాయన్నట్టుగా ఈ ప్రత్యక్ష ఎన్నికల్లో కూడా కొన్ని ఇబ్బందులు లేకపోలేదు. చైర్‌పర్సన్/మేయర్ పదవికి పోటీ చేసే వ్యక్తికి చాలా శ్రమ, ఆర్థిక భారం ఎదురవుతుంది. ఇంతకుముందు- ఒక వార్డు/డివిజన్‌లో మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తే, ఇప్పుడు మున్సిపాలిటీ, కార్పొరేషన్ మొత్తం మీద దృష్టి పెట్టి ప్రచారం చేయాలి. ఇక్కడ కూడా ధన బలం, కుల బలం ఉన్నవారికి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఒకవేళ రాష్ట్రంలో అధికారం మారితే, పట్టణ స్థానిక సంస్థలలో పాలన స్తంభిస్తుంది. చైర్‌పర్సన్/మేయర్లకు, శాసనసభ్యులకు మధ్య ఘర్షణ వాతావరణం పెరిగి ప్రజా సంక్షేమం కుంటుపడే ప్రమాదం ఉంది.

ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల అనుభవాలు చూస్తే- నాయకుల్లో జవాబుదారీతనంతో పాటు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నట్లు, ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగినట్టు, ప్రజలతో సంబంధాలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన పరోక్ష ఎన్నికల కంటే ప్రత్యక్ష ఎన్నికలే ప్రయోజనకరం.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి

- మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే!
- డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం.. జగన్ రెడ్డి సిద్ధమా?
- నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు పోరాడిన వ్యక్తి పరిటాల రవి
- స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నా
- పాదయాత్రలో నాతో నడిచిన వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా
- రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ సభలో మంత్రి లోకేష్



**రాప్తాడు సెప్టెంబర్ 22, అనంత జనశక్తి న్యూస్**

మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. జగన్ రెడ్డి సిద్ధమా అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరోసారి సవాల్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు కూడలిలో ఏర్పాటుచేసిన స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ముందుగా భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... ఈ రోజు మనం వేదికపై ఉన్నామంటే కారణం వేదిక కింద ఉన్న టీడీపీ కార్యకర్తల త్యాగం వల్లే. ఈ రోజు నేను స్వర్గీయ ఎన్టీఆర్ మనవడిగా, సీఎం చంద్రబాబు గారి తనయుడిగా, బాలయ్య మావయ్య అల్లుడిగా రాలేదు. ఎత్తిన పసుపు జెండా దించకుండా, మడమ తిప్పకుండా, టీడీపీకి కాపలాకాసిన కార్యకర్తగా ఇక్కడకు వచ్చాను. అన్న ఎన్టీఆర్ గారు ఏ ముహూర్తంలో పార్టీని స్థాపించారో తెలియదు. నాకు అక్కతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లు లేరు, కానీ కోటి మంది కుటుంబ సభ్యులను ఇచ్చారు. మీ పౌరుషమే వేరు. అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. రాజకీయాల్లో, సినిమాల్లో స్వర్గీయ ఎన్టీఆర్ గారి స్టైలే వేరు. ఆనాడు యువగళంలో దారిపొడవునా ప్రజలు నాకు నీరాజనాలు పలికారు. పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ఆనాటి సంబరం మళ్లీ ఈనాడు చూస్తున్నా.

**నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు పోరాడిన వ్యక్తి పరిటాల రవి**

నేను కూడా అన్న ఎన్టీఆర్ సీఎం అయిన తర్వాతనే పుట్టా. రూ.2కే కిలో బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎన్టీఆర్ గారు చేపట్టారు. ఈ రోజు మనందరం అన్న ఎన్టీఆర్ గారి వారసులం. ఈ రోజు మనం ఎక్కడికి వెళ్లినా గర్వంగా చెప్పుకోవచ్చు.. నా పార్టీ తెలుగుదేశం, నా పార్టీ, నా అజెండా అన్న ఎన్టీఆర్ అని. చంద్రబాబు గారు మొదటిసారి ముఖ్యమంత్రి అయినా అభివృద్ధి, సంక్షేమం చేశారు. పరిటాల రవి గారు కూడా ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పనులు చేశారు. మన పార్టీ అధికారంలోకి రాకముందు రాయలసీమలో మహిళలు బయట తిరగాలంటే బయపడే పరిస్థితి. దానికి ఫుల్ స్టాప్ పెట్టిన నాయకుడు మన పరిటాల రవీంద్ర గారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేశారు. ఆనాడు వందలాది మంది మన కార్యకర్తలను హత్య చేశారు. అయినా పరిటాల రవి గారు ఏనాడు భయపడలేదు. పార్టీ సమావేశానికి వెళ్తే చంపేశారు. అయినా ఆ కుటుంబం వెనక్కి తగ్గలేదు. పరిటాల సునీతమ్మ ముందుకు వచ్చారు. అసెంబ్లీలో బయపెట్టినా ఆమె భయపడలేదు. పార్టీని ముందుకు తీసుకెళ్లారు. ఇప్పుడు పరిటాల శ్రీరామ్ ని కూడా పార్టీకి అంకితం చేశారు.

**ఫైటర్ జెట్ తయారీ ఏఎంసీఏ ప్రాజెక్ట్ ను అనంత గడ్డకు తీసుకువచ్చాం**

రాప్తాడు ప్రజలు చాలా మంచివారు. ప్రజలను కలిసినప్పుడు ఇప్పుడు ఎవరూ నా చేతులను గీరలేదు. ధర్మవరంలో అయితే మొత్తం గీరేశారు. కార్యకర్తలు, నాయకులు 201924 మధ్య పడిన కష్టాలను గుర్తుచేసుకోవాలి. జీవో 1 ద్వారా యువగళం పాదయాత్రను అడ్డుకోవాలని చూశారు. స్టూల్, మైక్ లాక్కున్నారు. అయినా ఎక్కడా తగ్గలేదు. వేదిక ముందున్న నాయకులు, కార్యకర్తల ప్రోత్సాహంతో




ఆనాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో యువగళం పాదయాత్ర చేశా. ఇక్కడి ప్రజల కష్టాలను చూశా. అందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫైటర్ జెట్ లు తయారుచేసే ఏఎంసీఏ ప్రాజెక్ట్ ను మన అనంతపురం గడ్డకు తీసుకువచ్చా. సాగు, తాగునీరు, పరిశ్రమలను తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రత్యేకంగా నాపై బాధ్యత ఉంది. ఎందుకంటే అన్న ఎన్టీఆర్ ను, హరి మావయ్య, బాలయ్య మామను గెలిపించి శాసనసభకు పంపించిన అద్భుతమైన నేల ఇది. తాగునీరు, సాగునీరు అందిస్తాం.

**కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం**

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. ఎన్నికలు.. ఎన్నికలే.. తగ్గేదేలే. కష్టపడాలి, పనిచేయాలి. మనది పెద్ద కుటుంబం. కోటి ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారు. మన కుటుంబం పెద్దదైంది. ఇప్పుడు పవనన్న కూడా మన కుటుంబ సభ్యుడు అయ్యారు. బీజేపీ కూడా మన కుటుంబంలో చేరింది. మూడు పార్టీలు ఏపీని ముందుకు తీసుకెళ్తున్నాయి. సమస్యలు ఏవైనా ఉంటే నాలుగు గోడల మధ్య కూర్చొని పరిష్కరించుకుందాం. నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి అందరూ కట్టుబడి ఉండాలి. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి గౌరవిస్తాం. మన రాష్ట్రాన్ని మనందరం కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది.

**మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే!**

గొడ్డలితో బతికినవాళ్లు గొడ్డలితోనే పోతారు. పాఠాలు చెప్పే టీచర్లపై ఎలా దాడి చేశారో చూశాం. అయ్యా జగన్.. ఎందుకు మా ఉపాధ్యాయులంటే నీకు అంత కక్ష. డీఎస్సీపై చర్చకు సిద్ధమని నేను ఎన్నోసార్లు చెప్పా. నేను సిద్ధం.. నువ్వు సిద్ధమా? జగన్ రెడ్డి మాదిరిగా ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లాలంటే మాకు కోర్టు అనుమతి అవసరం లేదు. నీతి, నిజాయతీతో బతికినవాళ్లం. జగన్ రెడ్డి పెట్టిన కేసులు దొంగ కేసులని ఏకంగా సుప్రీంకోర్టే తేల్చిసిన పరిస్థితి. జగన్ రెడ్డి జాగ్రత్తగా ఉండు.. మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. ఉపాధ్యాయులపై దాడికి రౌడీమూకలను పంపారు. మొన్నటివరకు మన పార్టీలో వంగి, వంగి ఉన్నారు. ఇప్పుడు అక్కడకు వెళి కాలరెగరేస్తున్నారు. వదిలిపెట్టను భయ్యా! అన్నీ చూస్తున్నా. ఉపాధ్యాయులపై కోడిగుడ్లు వేస్తారా? అసభ్యంగా మాట్లాడతారా? అసలు మీరెక్కడ చదివారు? ఎవరు చదివించారు? ఇదేనా ఇంట్లో మీ తల్లిదండ్రులు నేర్పించిన సంస్కృతి? ఇదేనా ఉపాధ్యాయులకు మీరిచ్చే గౌరవం. నేను వదిలిపెట్టను. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టేది లేదు. రెడ్ బుక్ కు కట్టుబడి ఉన్నా. ప్రజలకు కూడా చెప్పా. వారి ఆశీస్సులతో 94శాతం స్థానాలు కైవసం చేసుకున్నాం. ఇక్కడున్న కార్యకర్తలకు ఒకటే చెబుతున్నా.. కష్టపడదాం, ప్రజలకు సేవచేద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి. ఈగో వద్దు, ప్రజల్లో ఉందాం.

**పాదయాత్రలో నాతో నడిచిన వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా**

రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి గారి విగ్రహాలను ఆవిష్కరించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ రోజు నా తమ్ముడు పరిటాల శ్రీరామ్ పుట్టిన రోజు. నా తమ్ముడు పుట్టినరోజు నాడు విగ్రహాలను ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నా. శ్రీరామ్ కు ఉదయం లేచిన వెంటనే పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ మొదటి మెసేజ్ పెట్టింది నేనే. ఒక్కసారి నమ్మితే నేను వదిలిపెట్టను. ఆనాడు పాదయాత్రలో నాతో నడిచిన వారు, ఆనాడు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మీరు నన్ను నడిపించారు. నా జీవితాంతం మిమ్మల్ని నా గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని చెప్పారు. తనకు ఘనస్వాగతం పలికిన రాప్తాడు ప్రజలకు ఈ సందర్భంగా మంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి ఎస్. సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే, హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు ఎం.ఎస్ రాజు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకట ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, హిందూపురం పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.








## మంత్రి నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన ఎమ్మెల్యే కాలవ.




**రాప్తాడు సెప్టెంబర్ 22, అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడులో మంగళవారం నిర్వహించిన స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌తో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆత్మీయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో మంత్రి సవితా, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సురేంద్రబాబు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# తల్లి బిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం...

**యాడికి, సెప్టెంబర్ 22: అనంత జనశక్తి న్యూస్**

తల్లి , బిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ధ్యేయమని తాడిపత్రి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఇన్చార్జ్ సిడిపిఓ విజయ్ కుమారి తెలిపారు. మంగళవారం యాడికి మండల పరిధిలోని పుప్పాల తాండా లో 9 వ జాతీయ పోషణ్ -2026 మాసోత్సవ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఉత్సాహ భరిత వాతావరణం లో ఘనంగా నిర్వహించారు

ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇంచార్జ్ సిడిపిఓ విజయ కుమారి మాట్లాడుతూ అర్హులందరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకొని లబ్ధి పొందాలని ముఖ్యంగా ప్రతి గర్భిణీ ,బాలింత పుష్టిగా తినాలి-ఆరోగ్యంగా ఎదగాలి అనే సూత్రాన్ని అలవర్చుకోవాలని పిలుపు నిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లి ,పిల్లలు, బాలింతలు కిషోర బాలికలు వారి ఆరోగ్యం పట్ల తీసుకో వలసిన జాగ్రత్తలపై అనేక పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పోషణ్ మాసోత్సవాలకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నట్లు తెలిపారు.

అనంతరం అంగన్వాడి కేంద్రం నుండి ప్రతినెల గర్భిణీలకు మరియు బాలింతలకు పంపిణీ చేసే బాల సంజీవిని కిట్ ( టెక్ హోమ్ రేషన్ ) ద్వారా పోషక విలువలు తగ్గకుండా రకరకాల వృత్తికరమైన వంటకాలు ఏ విధంగా తయారు చేయాలో అనే విధానాన్ని స్వయంగా ప్రదర్శన రూపంలో అవగాహన కల్పించారు.

ఆహార వైవిధ్యం -తగిన ప్రోటీన్ "మన అంగన్వాడి- మన బాధ్యత "అనే ప్రధాన ఇతివృత్తాలతో తల్లులకు పోషకాహార పద్ధతులపై చైతన్య సదస్సులు ,పోషణ మేళాలు, పోషక వంటకాల ప్రదర్శనలు, అవగాహన ర్యాలీలు తదితర లాంటి కార్యక్రమాలను ఐసిడిఎస్ ద్వారా ఈనెల 9నుండి అక్టోబర్ 8 వరకు అంగన్వాడిల పౌష్టిక ఆహారం ,ఆరోగ్యం బాలల వికాసం, సమాజ భాగస్వామ్యంతో మన అంగన్వాడీ మన బాధ్యత అనే అంశాలపై కార్యక్రమాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. అందువల్ల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అవగాహన చేసుకుని అర్హులందరూ లబ్ధి పొందాలన్నారు. ముఖ్యంగా రోగ నిరోధక శక్తిని పంచే పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, ప్రోటీన్ సమృద్ధిగా ఉండే బలవర్తక ఆహారాన్ని నిత్యం తీసుకోవాలని సూచించారు. తాండా వాసులందరూ ఆయా కుటుంబంలో ఉన్న తల్లులకు ఆహార నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాదిగా ప్రభుత్వ బడులకు పంపాలని, అంగన్వాడి పౌష్టికాహారం వల్లనే పిల్లలకు ఆరోగ్యకరమైన బాల్యం సాధ్యమవుతుందని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి జరుగుతున్న ఈ విస్తృత అవగాహన కార్యక్రమంలో సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు బాలామృతం ను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ ప్రాజెక్టు అధికారి ప్రచార విభాగం ఎపిఆర్ఓ ఫక్రుద్దీన్, స్థానిక నాయకులు జయరాం నాయక్, సూపర్వైజర్లు శంషాద్ బేగం , నాగేశ్వరి, వెంకటలక్ష్మి, టీచర్లు నాగ లక్ష్మి , ప్రమీల, మల్లేశ్వరి, రుక్మిణి, వరలక్ష్మి, ఎం.ఎల్.హెచ్.వి, సునీత ఆశా వర్కర్లు, గిరిజన తాండ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




# పుట్టపర్తి నియోజకవర్గానికి రూ.8.20 కోట్ల తాగునీటి నిధులు

**-గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 22:అనంత జనశక్తి న్యూస్**

పుట్టపర్తి నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశించారు. నియోజకవర్గ తాగునీటి సమస్యలు, పుట్టపర్తి మున్సిపాలిటీలో నీటి సరఫరా, వివిధ అభివృద్ధి పనులపై గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ, మున్సిపల్ అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు.నియోజకవర్గంలో తక్షణ తాగునీటి ఎద్దడి నివారణకు తన ప్రత్యేక కృషితో రూ.8.20 కోట్ల నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధుల కొరత



లేదని, అవసరమైన ప్రాంతాల్లో నిధులను వినియోగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.నీటి సమస్య ఉన్న గ్రామాలను తక్షణమే గుర్తించి, సమస్య తీవ్రతను బట్టి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. బోర్లు, పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి వనరులు, పంపింగ్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. సాంకేతిక లోపాలు, పైపులైన్ లీకేజీలు, నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

**పుట్టపర్తి మున్సిపాలిటీకి రూ.20 కోట్లు**

పుట్టపర్తి మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా, వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజలు ఫిర్యాదు చేసిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నిరంతరాయంగా తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి వనరులు, బోర్ల పరిస్థితి, పైపులైన్లు, ట్యాంకుల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ డీఈ గంగాధర్, ఆరు మండలాల ఏఈఈలు, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## లిటిల్ గణేశా సూపర్‌స్టార్స్ ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ ఉత్సవాలు

**మీరుపేట సెప్టెంబర్ 22,అనంత జనశక్తి న్యూస్**

హైదరాబాద్ మీరుపేటలోని ప్రగతి కాలనీ రోడ్ నంబర్ 4లో లిటిల్ గణేశా సూపర్‌స్టార్స్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.ఈ ఉత్సవాల్లో జీ. హర్షవర్ధన్, శ్రీ కుహల్, పి. తేజేష్ రెడ్డి, మోక్షిత్ కృష్ణ, దక్షిత్, జీ. మనస్విని, శ్రీ తనీష్, రామ్ చరణ్, రాహుల్ తదితరులు పాల్గొంటున్నారు.వినాయకుడికి ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

## గణేష్ ఉత్సవాల్లో ఘనంగా సేవా కార్యక్రమాలు



**హైదరాబాద్: సెప్టెంబర్ 22, అనంత జనశక్తి న్యూస్**

గౌరినందన సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న మూసారాంబాగ్ టీ జంక్షన్‌లో గణేష్ ఉత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో కొండ సంపత్, సుబ్బురి విశాల్, శశికాంత్, శివరామ్, వినోద్, సుందర్, సాయి, అఖిల్, మనోజ్, శివ, హరీష్, శ్రీమంత్, జయంత్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.ఈ నెల 21న సాయంత్రం 7 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు గణేష్ చతుర్థి శుభాకాంక్షలు తెలిపారు.

## బిజెపి జిల్లా లీగల్ సెల్ సెక్రెటరీగా బీమలింగప్ప

**శెట్టూరు సెప్టెంబర్ 22 అనంత జనశక్తి న్యూస్.**




అనంతపురం జిల్లా, బిజెపి జిల్లా లీగల్ సెల్ సెక్రెటరీగా బీమలింగప్ప ను, నియమిస్తూ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు, హంపపురం, ఆదినారాయణ తెలియజేశారు, ఈ సందర్భంగా నూతనంగా నియామకాలు చేపట్టిన బీమలింగప్ప, మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని, అప్పచెప్పినందుకు. బిజెపి . నాయకులకు లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులకు,కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ, ప్రతిష్టకు పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలియజేశారు

## నారాయణ స్కూల్స్ కళాశాలలను సందర్శించిన వి బి ఆర్

**అనంతపురం సెప్టెంబర్ 22 అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం నగరంలోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్ కళాశాలలను సోమవారం నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్స్ మరియు కళాశాలల్లో విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు.పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని అలాగే చదువుతోపాటు వివిధ రకాల ఆటల పోటీలు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, యోగా తరగతులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు స్కూల్స్ కళాశాలల క్లస్టర్ ప్రిన్సిపాల్స్ ప్రిన్సిపాల్ ఏజీఎంలు డిజిఎంలు పాల్గొన్నారు

# మాజీ కౌన్సిలర్ జాపాల భావనా సుధాకర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

- భారీ సంఖ్యలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలో పాల్గొని ముగ్గులు వేసిన మహిళలు
- వర్షాన్నిసైతం లెక్కచేయకుండా ముగ్గులు వేసిన మహిళలు
- ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతుల ప్రదాత జాపాల భవనా సుధాకర్
- ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు ప్రధానం చేస్తున్న
- తుక్కుగూడ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జాపాల భవనా



సుధాకర్


**మహేశ్వరం, సెప్టెంబర్ 22 ( అనంత జనశక్తి):**

తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, మన తెలుగు సంప్రదాయాన్ని కాపాడేందుకు తుక్కుగూడ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జాపాల భవనా సుధాకర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నాడు నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు మహిళల నుండి అనూహ్య స్పందన లభించింది. భారీ సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతతో అందమైన, ఆకర్షణీయమైన రంగురంగుల ముగ్గులను వేశారు. ఉదయం నుండి వర్షం కురుస్తున్నప్పటికీ, మహిళలు ఏ మాత్రం వెనకడుగు వేయకుండా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎంతో ఉత్సాహంతో ముగ్గులు వేసి తమ ప్రతిభను చాటుకోవడం విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ జాపాల భవనా సుధాకర్ మాట్లాడుతూ, మహిళలను చైతన్యవంతం చేయడం, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఇలాంటి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని, వారిలో దాగి ఉన్న కళను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని తెలిపారు.
అనంతరం ముగ్గుల పోటీలో అత్యంత అందంగా ముగ్గులు వేసిన విజేతలకు జాపాల భవనా సుధాకర్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పలువురికి కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేశారు.ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ముగ్గుల పోటీలను నిర్వహించి మహిళలకు బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్న తుక్కుగూడ మాజీ కౌన్సిలర్ జాపాల భవనా సుధాకర్ ను స్థానిక మహిళలు, ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో నార్ల కంటి బాలరాజు, అంబోజీ రమేష్, భాస్కర్ రెడ్డి,రాంబాబు శ్రీకాంత్, జగదీష్,నవీన్,సిద్ధూ,కార్తీక్, రాజు,అరుణ్, తరుణ్, బబ్లు, క్రిష్, సాయి,వరుణ్,నరసింహ పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల కు స్టేజి నిర్మాణం విరాళం

- వేదిక నిర్మాణ దాత లయన్ చేసిన ఎడ్మ సుగుణ-సంజీవరెడ్డి
- కృతజ్ఞతలు తెలిపిన కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి

**జనగాం సెప్టెంబర్ 22 అనంత జనశక్తి న్యూస్**




స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు మూడు లక్షల వ్యయంతో నిర్మించిన కళాశాల ప్రేయర్ స్టేజి ఓపెనింగ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్టేజి నిర్మాణ దాత లయన్ ఏడ్మ సుగుణ సంజీవరెడ్డి గారు మరియు వారి అల్లుడు దయాకర్ రెడ్డి కుమారుడు శ్రీనివాస్ గారూ గవర్నర్ ఎల్ నరహరి, లయన్ సుధాకర్ రెడ్డి గారి వాసవి క్లబ్ వైస్ గవర్నర్ డి జి ఎల్ ఓ లయన్ డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేద విద్యార్థులు చదువుకునే ఈ కళాశాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నటువంటి లయన్ క్లబ్ సభ్యులకు మరియు స్టేజి నిర్మాణ దాత హెడ్మా సుగుణ సంజీవరెడ్డి గార్లను కళాశాల అధ్యాపక బృందం సన్మానం చేయడం జరిగింది. కళాశాలకు వివిధ రకాల విరాళాలు ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కళాశాల సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు అన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరమని రీజినల్ చైర్మన్ జైన రమేష్, ప్రెసిడెంట్ రావుల రవి అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ చార్టర్ మెంబర్స్ పజ్జూరి గోపయ్య, పజ్జూరి జయహరి, పూర్వ జిల్లా గవర్నర్లు లయన్ కన్నా పరశురాములు డాక్టర్ లవ కుమార్ రెడ్డి, కదిరి రాజశేఖర్ రెడ్డి కోతాటి ఉప్పలయ్య చీరాల బాబు తొడుపునూరి వెంకటనారాయణ, రీజియన్ చైర్మన్ డాక్టర్ మాధంశెట్టి వరూధిని, వైస్ ప్రెసిడెంట్ కాపర్తి శ్రీనివాస్,దాతలు పబ్బ చంద్రశేఖర్, బుద్ధ రమేష్ చదలవాడ రాఘవేంద్ర, మరియు కళాశాల అధ్యాపక ఆధ్యాపకేతర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈరోజు రాప్తాడు పార్టీ కేడర్ కు పండుగ రోజు!







- యువనేత లోకేష్ రాకపై పరిటాల సునీత ఆనందం
- కార్యకర్తల అభీష్టం మేరకే రాజకీయాల్లోకి వచ్చా
- పార్టీ కేడర్ పై తప్పుడు కేసులు తొలగించండి

**రాప్తాడు సెప్టెంబర్ 22, అనంత జనశక్తి న్యూస్**

యువనేత లోకేష్ రాప్తాడు రావడం పార్టీ కేడర్ కు పండుగ రోజు. దివంగత ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహావిష్కరణకు తొలిసారి నియోజకవర్గానికి ఆనందంగా ఉందని రాప్తాడు ఎమ్మెల్యే, మాజీమంత్రి పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమన్వయ సమావేశంలో సునీతమ్మ మాట్లాడుతూ... రాప్తాడు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో చాలామందిని ఇబ్బంది పెట్టారు. కనీసం పెళ్లిళ్లకు కూడా వెళ్లకుండా అడ్డుకున్నారు. కార్యకర్తలు బెదరకుండా ధైర్యంతో నిలబడ్డారు. ఎన్టీఆర్ పిలుపు మేరకు పరిటాల రవీంద్ర రాజకీయాల్లోకి వచ్చారు. నాడు అన్న ఎన్టీఆర్ వద్దన్నా మంత్రి పదవి ఇచ్చి ఆదరించారు. చంద్రబాబు గారి పిలుపుమేరకు నేను రాజకీయాల్లోకి వచ్చాను. ఆనాడు కార్యకర్తలే నా వెన్నంటి నడిపించారు. చంద్రబాబు మూడుసార్లు టిక్కెట్ ఇచ్చి, ఒకసారి మంత్రినిచేసి మా కుటుంబాన్ని ఆదరించారు. గత ప్రభుత్వంలో నాపై 22, శ్రీరామ్ పై 34, కార్యకర్తలపై 20కి పైగా కేసులు పెట్టారు. ఆ కేసుల గురించి ఆలోచించాలని లోకేష్ ను కోరుతున్నా. రాప్తాడు నియోజకవర్గంలో అన్ని సామాజికవర్గాలు మాకు అండగా నిలబడ్డాయి. ప్రత్యర్థులు చేతిలో ప్రాణాలు కోల్పోయిన తగరకుంట ప్రభాకర్ ఆరుగురి బిడ్డలను చంద్రబాబు చదివించి ప్రయోజకులను చేశారు. పరిటాల రవి గారితోపాటు చనిపోయిన వారి పిల్లలను చదివించారు. వాడుకుని పక్కనపడేసే పార్టీ కాదు తెలుగుదేశం. రాప్తాడు నియోజకవర్గంలో 11మందికి కార్యకర్తల సంక్షేమనిధి అందించారు. యువనేత లోకేష్ కార్యకర్తలకు ధైర్యాన్నిస్తూ యువగళం పాదయాత్ర చేసి స్ఫూర్తినిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వెనుక చంద్రబాబు, లోకేష్ రెక్కల కష్టం దాగిఉంది. అందువల్లే రాప్తాడులో దాదాపు 25వేలకు పైగా మెజారిటీ వచ్చింది. ఈ నియోజకవర్గంలో చిన్న సైకోను సాగనంపాలని ప్రజలు,కార్యకర్తలు నిర్ణయించుకొని, ఎన్నికల్లో నెరవేర్చుకున్నారు. రాప్తాడు నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించే రూ.800 కోట్ల అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు అందించినందుకు కృతజ్ఞతలు. రైతులకు త్వరగా పరిహారం అందించాలని కోరుతున్నా. రాప్తాడు మండలంలో జూనియర్ కాలేజి మంజూరు చేయండి. రామగిరిలో హాస్టల్ భవనం, ఆత్మకూరులో కాలేజి మంజూరు చేయండి. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ బాబు వచ్చాకే స్కూళ్లు బాగుపడ్డాయి. చదువుకునే ప్రతిబిడ్డకు తల్లికి వందనం అందిస్తున్నారు. మీ ఆదేశాల మేరకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని సునీత చెప్పారు.

**స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించాలి!**

హిందూపురం ఎంపి బికె పార్థసారధి మాట్లాడుతూ... దివంగత ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణకు యువనేత లోకేష్ రాప్తాడు రావడం ఆనందంగా ఉంది. ఆనాడు పరిటాల రవీంద్ర గారు దివంగతులయ్యాక వచ్చిన ఎన్నికల్లో పార్టీ కేడర్ వెన్నుచూపకుండా 15వేల మెజారిటీతో పార్టీని గెలిపించారు. 2019లో అధికారం కోల్పోయాక బెదిరించారు. రామగిరి పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేశాం. ఎక్కడా భయపడలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చిన్నచిన్న విభేదాలను పక్కనబెట్టి ఏకపక్షంగా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి. 201924లో అభివృద్ధి జరగలేదు. చంద్రబాబు గారు హంద్రీనీవాను 3వేలకోట్లతో విస్తరించి కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్లారు. యువనేత లోకేష్ యువగళంలో ఇచ్చిన 20లక్షల ఉద్యోగాల హామీమేరకు పరిశ్రమలు పెద్దఎత్తున ఎపికి వస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి, పార్టీ బాగుంటేనే అందరం బాగుంటాం. మరో 20ఏళ్లు తెలుగుదేశం అధికారంలో ఉండాలని అన్నారు.



**స్థానిక ఎన్నికల్లో ఇదే ఉత్సాహాన్ని కొనసాగించండి:శ్రీరామ్**

ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... మీ అందరి సహకారంతో లోకల్ బాడీలో అద్భుత విజయాన్ని సాధించబోతున్నాం. పార్టీ కార్యకర్తలంతా గ్రామాల్లోకి వెళ్లి ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలి. యువగళం రథసారధి లోకేష్ కు ఘనస్వాగతం పలికిన పార్టీ కేడర్ కు అభినందనలు తెలిపారు. పార్లమెంటు పార్టీ ప్రెసిడెంట్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ... కార్యకర్తల సంక్షేమం ధ్యేయం మొట్టమొదటిసారిగా కార్యకర్తల సంక్షేమనిధిని ఏర్పాటుచేసిన నాయకుడు లోకేష్. గత చీకటి పాలనను ఎదురొడ్డి యువగళం పాదయాత్ర ద్వారా రాష్ట్రప్రజలకు అండగా నిలబడ్డారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ దుర్మార్గాలకు చరమగీతం పాడారు. ఒకవైపు రాష్ట్రాభివృద్ధి, మరోవైపు కార్యకర్తల సంక్షేమం కోసం శ్రమిస్తున్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు ఆశయాలను కొనసాగిస్తున్న భవిష్యత్ నాయకుడు లోకేష్ అని కొనియాడారు.



# గర్భధారణలో విటమిన్ డి పాత్ర: సూర్యకాంతి ఆశీర్వాదమా శాపమా?


సూర్యకాంతి ద్వారా మానవ శరీరం విటమిన్ డిని ఉత్పత్తి చేస్తుంది. అందుకే దీనిని "సూర్యకాంతి విటమిన్" అంటారు. విటమిన్ డి లోపం గర్భధారణ ఫలితాలను ప్రభావితం చేస్తుంది కాబట్టి, ఇది తల్లి, పిండం ఆరోగ్యానికి చాలా అవసరం. బెంగళూరులోని బ్రూక్ ఫీల్డ్ లోని అపోలో క్రేడిల్ & చిల్డ్రన్స్ హాస్పిటల్ లోని ప్రసూతి మరియు స్త్రీరోగ శాస్త్ర నిపుణురాలు డాక్టర్ గరిమా జైన్ హెచ్ టి లైఫ్ స్టైల్ తో ఇంటర్వ్యూలో దీని గురించి వివరించారు, "గర్భధారణ సమయంలో శిశువు అస్థిపంజర వ్యవస్థ సరైన అభివృద్ధికి శరీరంలో కాల్షియం అవసరం పెరుగుతుంది. అంతేకాకుండా, విటమిన్ డి కాల్షియంను గ్రహించడంలో సహాయపడుతుంది. ఇది శరీరానికి చాలా ముఖ్యం. ఎందుకంటే ఇది బలమైన దంతాలు, ఎముకల అభివృద్ధికి అవసరం. విటమిన్ డి రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడంలో, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. తల్లికి మెరుగైన ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.." అని వివరించారు.




విటమిన్ డి సరిపోయే స్థాయిలో ఉన్న తల్లులకు జన్మించిన శిశువులు ఆస్తమా, రికెట్స్ వంటి అనారోగ్య పరిస్థితులు అభివృద్ధి చేయడానికి తక్కువ అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే రక్తంలో విటమిన్ డి స్థాయిలు తగినంతగా లేకపోవడం వల్ల గర్భధారణ సమయంలో ప్రీక్లంప్సియా, గర్భధారణ మధుమేహం, ముందస్తు ప్రసవం, తక్కువ బరువుతో జన్మించడం వంటి సమస్యలు సంభవించవచ్చు.

**విటమిన్ డి మూలంగా సూర్యకాంతి, ప్రమాద కారకాలు**

"చర్మం సూర్యకాంతికి గురైనప్పుడు శరీరం సహజంగా విటమిన్ డిని ఉత్పత్తి చేస్తుంది. సూర్యకాంతి విటమిన్ డిని ఉత్పత్తి చేయడానికి ప్రయోజనకరమైనప్పటికీ, అధికంగా గురవడం హానికరం. చర్మం తరచుగా అతినీలలోహిత వికిరణాలకు గురైనట్లయితే, చర్మం దెబ్బతినడం, సన్ బర్న్, చర్మ క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి.." అని డాక్టర్ గరిమా జైన్ తెలిపారు.







"గర్భధారణ సమయంలో మహిళలు చర్మ సున్నితత్వానికి గురవుతారు. ఇది వారిని మెలాస్మా, చర్మ వర్ణద్రవ్యానికి గురిచేస్తుంది. ఉదయం లేదా సాయంత్రం సమయంలో అరగంట సూర్యకాంతి పడనివ్వడం పగటిపూట కంటే చాలా సురక్షితం, ఆరోగ్యకరం. సున్నితమైన ప్రాంతాలకు సన్ స్క్రీన్ వేసుకుంటూ కొంత చర్మాన్ని బహిర్గతం చేయడం వల్ల శరీరం సూర్యకాంతిని గ్రహించి విటమిన్ డిని ఉత్పత్తి చేయడానికి అనుమతిస్తుంది. సూర్యుని కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించవచ్చు.." అని డాక్టర్ సూచించారు.

**ఆహార మూలాలు, మందులు**

"సూర్యకాంతి మాత్రమే తగినంత విటమిన్ డిని అందించకపోవచ్చు కాబట్టి, పోషకాలతో కూడిన పాలు, గుడ్లు, సాల్మన్, కాడ్ లివర్ ఆయిల్ వంటి ఆహార పదార్థాలు చేర్చడం చాలా ముఖ్యం. ఆహారంలో వీటిని చేర్చడం వల్ల మంచి ఆరోగ్యం కొనసాగుతుంది. కొన్ని సందర్భాల్లో ముఖ్యంగా రక్త పరీక్షల్లో విటమిన్ డీ లోపాన్ని గుర్తించినప్పుడు సప్లిమెంట్లు తీసుకోవాలని సిఫార్సు చేస్తారు..' అని డాక్టర్ వివరించారు.


సూర్యకాంతి శరీరం విటమిన్ డిని ఉత్పత్తి చేయడంలో ముఖ్యంగా గర్భధారణ సమయంలో చాలా ముఖ్యం. అయితే, అధికంగా గురవడం వల్ల కలిగే ప్రమాదాలను నివారించడానికి మితంగా ఉండాలి. ఏదైనా పరిమితమైన లేదా హానికరమైన వస్తువుల మాదిరిగా, సహజ సూర్యకాంతిని సమతుల్య ఆహారం, మందుల ద్వారా భర్తీ చేయవచ్చు. సూర్యకాంతి, ఆహారం మందుల నుండి సరిపోయే విటమిన్ డిని పొందడం వల్ల ఆరోగ్యకరమైన గర్భధారణ, తల్లి శిశువుకు మరింత సానుకూల ఫలితాలు లభిస్తాయి.



# అలసట, ఆందోళనను తగ్గించే 4 యోగాసనాలు.. యోగా నిపుణుల సలహా ఇదీ



పోటీ, శ్రమ, నైపుణ్యాభివృద్ధి నేటి సాధారణ విషయాలు. అయితే, మీ ఆరోగ్యం నిశ్శబ్దంగా సహాయం కోరుతోంది. ఆధునిక జీవనశైలిలో స్వీయ-సంరక్షణకు తగినంత సమయం లేకపోవడం వల్ల అలసట పేరుకుపోతుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఆందోళనను పెంచుతుంది. ఇది దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తుంది. కాబట్టి, యోగాతో విశ్రాంతి తీసుకోవడం వంటి స్వీయ-సంరక్షణ చర్యలు దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడటానికి చాలా ముఖ్యం. సమాజ ఆరోగ్యం నేరుగా జీవనశైలితో ముడిపడి ఉంది. ఆటో ఇమ్యూన్ వ్యాధులు పెరగడానికి కారణం దీర్ఘకాల పని గంటలు, డిజిటల్ వినియోగం, శారీరక శ్రమ లేకపోవడం, స్వీయ సంరక్షణకు సమయం కేటాయించలేకపోవడం వంటి సమస్యలను అధిగమించడానికి యోగా ఒక సమగ్రమైన మార్గాన్ని అందిస్తుందని ఆయన వివరించారు.



**1. బాలాసన**

లాభాలు: వెన్నుపూసను సాగదీయడం, నడుము నొప్పి నుండి ఉపశమనం, కుడి కాలు నడుమును మెరుగుపరచడం, అలసట-ఒత్తిడిని తగ్గించడం, మనస్సును శాంతపరచడం.

ఎలా చేయాలి:


వజ్రాసనంలో కూర్చోండి. శ్వాస పీల్చుకుంటూ చేతులు పైకెత్తండి. పెల్విస్ కదలకుండా చూసుకోండి. శ్వాస వదులుతూ ముందుకు వంగి, కడుపును నేలకు ఆనించండి. వెన్నెముక పూర్తిగా సాగాలి. ఛాతి కాళ్లపై ఆనించాలి. పాదాలు నేలపై ఉండాలి. కళ్ళు మూసుకోవచ్చు.

**2. సంచలిత్ మర్జరి-ఆసనం (క్యాట్-కౌ పోజ్)**

లాభాలు: నడుముని బాగా వంచుతుంది, సాగే గుణం పెరుగుతుంది. వెన్నెముక ఆరోగ్యంగా ఉంటుంది. మెడ నొప్పి, పట్టేసినట్టు ఉండటం తగ్గుతుంది. నిటారుగా కూర్చునేలా, నిలబడేలా చేస్తుంది. కడుపులోని అవయవాలను ఉత్తేజపరిచి, మంటను తగ్గిస్తుంది.

ఎలా చేయాలి:

మొదటిగా: మీరు చేతులు, మోకాళ్ళపై టేబుల్‌లాంటి పొజిషన్‌లో ఉండాలి. మీ మోకాళ్ళు తుంటికి సరిగ్గా కింద, భుజాలు మణికట్టుకు సరిగ్గా పైన ఉండేలా చూసుకోండి. వీపు నేలకు సమాంతరంగా, కాళ్లు భుజాల వెడల్పు దూరంలో ఉండాలి.





ఊపిరి లోపలికి పీలుస్తూ (పైకి చూసే పిల్లి): ఇప్పుడు, ఊపిరి లోపలికి పీలుస్తూ, ఛాతీని కిందకి నొక్కి, గడ్డాన్ని పైకి చాచి, తుంటిని బయటికి నెట్టండి. అప్పుడు మీ వీపు లోపలికి వంగుతుంది.

ఊపిరి బయటికి వదులుతూ (కిందకి చూసే పిల్లి): ఆ తరువాత, ఊపిరి బయటికి వదులుతూ, మీ వీపును బయటికి వంచుతూ (గుండ్రంగా చేస్తూ), గడ్డాన్ని గొంతుకు దగ్గరగా తీసుకురండి. పొట్టను లోపలికి లాగి, బొడ్డు వైపు చూడండి.

ఇలా చేయండి: ఈ కదలికను పైకి చూసే పిల్లి నుండి కిందకి చూసే పిల్లికి మారుస్తూ 8 నుండి 10 సార్లు చేయండి.

**3. కపాలభాతి ప్రాణాయామం**

లాభాలు: మన శరీరంలోని శక్తి ప్రవాహ మార్గాలను శుభ్రం చేస్తుంది, శక్తిని పైకి అంటే తల వైపునకు పంపుతుంది. ఇది మెదడును ఉత్సాహపరుస్తుంది. నాడీ వ్యవస్థను చురుకుగా ఉంచుతుంది. దీనివల్ల ఆలోచనా శక్తి, ఏకాగ్రత పెరుగుతాయి.

ఎలా చేయాలి:

సుఖాసనం (సులభమైన కూర్చునే భంగిమ) లో కూర్చోండి. మీ శ్వాసను నిలకడగా ఉంచి, వీపును నిటారుగా ఉంచండి.

బలంగా ఊపిరి బయటికి వదులుతూ కడుపును, పొట్టను లోపలికి లాగండి. మిగిలిన శరీరం మాత్రం రిలాక్స్‌డ్‌గా ఉండాలి.

ఇలా 50-60 సార్లు చేయండి. అంటే, ఊపిరిని బలంగా బయటికి వదలాలి.

ఒక రౌండ్ అయ్యాక శ్వాసను సాధారణ స్థితికి తీసుకురావడానికి కాసేపు ఆగి, 2-3 రౌండ్లు పునరావృతం చేయండి.

**4. యోగనిద్ర**

లాభాలు: యోగా నిద్ర అనేది మనసుకు ప్రశాంతతనిచ్చి, శరీరంలోని అవయవాలకు విశ్రాంతినివ్వడానికి, వాటిని ఆరోగ్యంగా మార్చడానికి ఒక బలమైన సాధనం. ఇది మన శరీరంపై పూర్తి అవగాహనను పెంచుతుంది. ప్రతి భాగాన్ని జాగ్రత్తగా గమనించడానికి, అన్ని వ్యవస్థలనూ తిరిగి కొత్తవిగా చేయడానికి సహాయపడుతుంది.

యోగా నిద్రను క్రమం తప్పకుండా చేయడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. గుండె లయ క్రమబద్ధంగా ఉంటుంది. నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. భావోద్వేగ ఆరోగ్యం బాగుంటుంది. ఇంకా మానసిక శక్తి పెరుగుతుంది. ఒత్తిడిని మనం సాధారణంగా మానసికంగానే చూస్తాం, కానీ మన శరీరంలో కూడా చాలా ఒత్తిడి పేరుకుపోయి ఉంటుంది. యోగా నిద్ర ఈ పేరుకుపోయిన ఒత్తిడిని గుర్తించి, దాన్ని విడుదల చేయడానికి సహాయపడుతుంది.



ఎలా చేయాలి:

ఒక నిశ్శబ్ద ప్రదేశంలో పడుకుని, కళ్ళు మూసుకోండి.

నిదానంగా, లోతుగా శ్వాస తీసుకోండి. శరీరం లోపల ఉన్న ఒత్తిడినంతా వదిలేసి, ప్రశాంతంగా ఉండండి.

## 'ఆదర్శ కుటుంబం' విడుదల వాయిదా.. వచ్చేది ఎప్పుడంటే?



వెంకటేశ్ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47' ) విడుదల వాయిదా పడింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అక్టోబరు 2న విడుదల కావాల్సి ఉండగా, మరో వారం ఆలస్యం కానుంది. అక్టోబరు 9న ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ పేర్కొంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. 'ఆదర్శ కుటుంబం'లో శ్రీనిధిశెట్టి కథానాయిక. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

## ఇన్‌స్టాలోకి రాకపోతే డబ్బులు కోల్పోతావని చెప్పారు



ఏడాది నుంచి సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నారు నటి ఐశ్వర్య లక్ష్మి సోషల్ మీడియాను పూర్తిగా వదిలేస్తానని తాను ఎప్పుడూ ఊహించలేదని.. మానసిక ప్రశాంతత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు.

"నేను ఏదో కారణంగా ఈ నిర్ణయం తీసుకోలేదు. కొన్నిరోజులు నిలిపివేసి తిరిగి వద్దామని భావించా. కానీ, విపరీతంగా పెరిగిపోయిన ఏఐ ఆధారిత కంటెంట్.. దాన్ని ఉపయోగించి చేస్తోన్న అసభ్యకరమైన ఎడిటింగ్ సంస్కృతి చూసి విసిగిపోయాను. సోషల్ మీడియాకు దూరంగా ఉండడం వల్ల ఒక వ్యక్తిగా నాకు చాలా స్వేచ్ఛ దొరికినట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నేను చాలా సంతోషంగా ఉన్నాను. 'దయచేసి మీరు మళ్లీ అకౌంట్ క్రియేట్ చేసుకోండి.. లేదంటే చాలా డబ్బు నష్టపోతారు' అని నా మేనేజర్లు చెప్పారు. కానీ, వీటన్నింటికీ దూరంగా ఉండడం వల్ల వచ్చే మానసిక ప్రశాంతత నాకు అన్నిటికంటే విలువైనది అని చెప్పాను" అని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు.


'ఇంతకుముందు కామెంట్లు, మెసేజ్‌లు చదివేదాన్ని.. దాంతో ప్రపంచమంతా నాకు వ్యతిరేకంగా ఉందని అనిపించేది. నన్ను ఎవరూ ఇష్టపడరనే భావన మొదలైంది. కామెంట్స్ మనకు తెలియకుండానే నెగెటివిటీని సృష్టిస్తాయి" అని చెప్పారు. ఇక బ్రాండ్ ప్రచారాల గురించి ఆమె మాట్లాడుతూ.. తాను నెట్టింట ప్రచారం చేయలేనని పేర్కొన్నారు. తనను సినిమాలతోనే ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు.

## జెన్‌జీకి నచ్చే చిత్రం



"అందమైన ప్రేమకథతో పాటు మంచి సందేశమున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్" అన్నారు నిర్మాత బెక్కెం వేణుగోపాల్. సుగి విజయ్, జుప్పీ భద్ర, హారిక రాజేందర్ నాయకానాయికలుగా నటించిన ఈ సినిమాని పరమేశ్ రేణుకుంట్ల తెరకెక్కించారు. కార్తీక్ వెంపటి నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు నెలాఖరున థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని "అప్పుడే పెళ్లా.." అనే గీతాన్ని సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "జెన్‌జీ తరానికి బాగా కనెక్ట్ అయ్యే చిత్రమిది. దీన్ని ఇటీవలే కొంతమంది యువతకు చూపించగా.. వాళ్లకు చాలా నచ్చింది. దీంతో ఈ చిత్ర విజయంపై మరింత నమ్మకం ఏర్పడింది" అన్నారు దర్శకుడు పరమేశ్. ఈ కార్యక్రమంలో జుప్పీ భద్ర, వరికుప్పల యాదగిరి, దయానంద్, కార్తీక్, ఆవుల వెంకటేశ్, కాశీ పాల్గొన్నారు.

## శీతాకాలంలో ఆహ్లాదకర ప్రేమకథ



విజయవంతమైన 'హిట్' సిరీస్ చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించారు దర్శకుడు శైలేష్ కొలను. ఇప్పుడాయన రోషన్ మేక హీరోగా రూపొందిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఏమో ఏమో ఇది'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని అక్టోబరు 30న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు చిత్ర బృందం సోమవారం ప్రకటించింది. ఈమేరకు రోషన్ - ప్రీతిల క్యూట్ రొమాంటిక్ పోస్టర్‌ని నెట్టింట పంచుకుంది. "ఇదొక ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రం. ఈ శీతాకాలంలో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రేమానుభూతిని అందించనుంది. రోషన్ - ప్రీతిల జోడీ.. వాళ్లిద్దరి కెమిస్ట్రీ ఆకర్షణగా నిలుస్తుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

## అమ్మాయిలూ.. దేశం గర్విస్తోంది:

### టీమ్ఇండియాపై మోదీ ప్రశంసలు



వరుసగా రెండోసారి ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత మహిళా జట్టు స్వర్ణం నెగ్గింది. తాజాగా శ్రీలంకపై 147 పరుగుల భారీ వ్యత్యాసంతో టీమ్ఇండియా విజయం సాధించింది. దీంతో ఆసియా క్రీడలు - 2026 ఎడిషన్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించింది. హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమ్ఇండియా అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించింది. స్వర్ణ పతకం నెగ్గిన అమ్మాయిల జట్టుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ సహా పలువురు అభినందనలు తెలిపారు.

"భారత మహిళ జట్టు సభ్యులందరికీ నా శుభాకాంక్షలు. చరిత్రలో నిలిచిపోయే విజయంతో ఈ ఎడిషన్‌లో తొలి బంగారు పతకం అందించారు. జాతి గర్వపడేలా చేశారు. అద్భుతమైన ప్రదర్శన, బృంద స్ఫూర్తి, నిబద్ధత.. రాబోయే తరాలకు మరీ ముఖ్యంగా ఆడబిడ్డలకు స్ఫూర్తిదాయకం" - ద్రౌపది ముర్ము

"భారత క్రికెట్‌కు ఇదొక అద్భుతమైన విజయం. మన అమ్మాయిలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించడం అభినందనీయం. ఆత్మవిశ్వాసం, అద్భుతమైన నైపుణ్యం, బృందంగా ఆడిన తీరు అమోఘం. ఈ విజయం.. ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి బంగారు పతకం తీసుకొచ్చింది. దేశం గర్వించేలా చేశారు. యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచారు. ఆసియా క్రీడల్లో తొలిసారి ప్రవేశపెట్టిన ఎంఎంఏ విభాగంలో పతకం నెగ్గిన సుచిక తరియల్‌కు అభినందనలు. చరిత్ర సృష్టించే ప్రదర్శన చేశావు " - నరేంద్ర మోదీ

"ఇది కదా క్రికెట్ గేమ్ అందం. భిన్నమైన ఆటగాళ్లు, భిన్నమైన క్షణాలు.. చివరికి గొప్ప ఫలితం. షఫాలీ - స్మృతి మంధాన 99 పరుగుల భాగస్వామ్యమే భారత జట్టుకు ఆత్మవిశ్వాసం తీసుకొచ్చింది. ఆఖర్లో షఫాలీ వర్మ దూకుడైన గేమ్‌తో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యం ఉంచగలిగాం. షఫాలీ, దీప్తి, శ్రేయాంక, శ్రీ చరణి దెబ్బకు శ్రీలంక కుప్పకూలింది. జట్టుగా విజయం సాధించిన టీమ్ఇండియాకు కంగ్రాట్స్" - సచిన్

## ఆసియా క్రీడలు.. 13 ఏళ్లకే స్విమ్మింగ్‌లో రెండు స్వర్ణాలు



ప్రపంచ ఆక్వాటిక్స్‌లో మెకింతోష్‌తో జిడి తలపడే అవకాశం ఉంది.

ఆసియా క్రీడల్లో చైనా బాలిక యు జిడి ప్రకంపనలు రేపుతోంది. 13 ఏళ్లకే ఆమె.. ఆసియా క్రీడల స్విమ్మింగ్‌లో రెండు స్వర్ణ పతకాలు గెలిచింది. 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో 2 నిమిషాల 6.10 సెకన్లలో రేసు పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచిన జిడి.. 200 మీటర్ల బటర్‌ఫ్లైలో 2 నిమిషాల 5.08 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి కైవసం చేసుకుంది. మూడో స్వర్ణంపైనా జిడి కన్నేసింది. ఆమె 400 మీటర్ల మెడ్లీలోనూ బరిలో ఉంది. ఈ ఏడాది చైనాలో జరిగిన మీట్‌లో 200 మీటర్ల బటర్‌ఫ్లైలో పారిస్ ఒలింపిక్స్ రజత విజేత రెగాన్ స్మిత్ (అమెరికా)ను అధిగమించి జిడి పసిడి గెలుచుకుంది. ఈ చైనా బాలిక ఇదే జోరు కొనసాగిస్తే వచ్చే ఒలింపిక్స్‌లో కెనడా మేటి సమ్మర్ మెకింతోష్‌కు గట్టిపోటీ ఇచ్చే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది

## జపాన్‌తో చారిత్రక మ్యాచ్.. భారత్‌దే విజయం



ఆసియా క్రీడల్లో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగబోతున్న టీమ్ఇండియా.. అంతకంటే ముందే విజయాల బోణీ కొట్టింది. ఆసియా క్రీడల ఆతిథ్య దేశం జపాన్‌తో జరిగిన చారిత్రక తొలి టీ20 మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. వర్షం కారణంగా 5 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో.. జపాన్‌పై టీమ్ఇండియా 2 పరుగుల తేడాతో గెలుపొందింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. నిర్ణీత ఐదు ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి డకౌట్ అయ్యాడు. సంజూశాంసన్ (9), ఇషాన్ కిషన్ (3) కూడా విఫలమయ్యారు. శ్రేయస్ అయ్యర్ (16) ఫర్వాలేదనిపించాడు. జపాన్ బౌలర్లలో ఛార్లీ హరా-హింజే రెండు వికెట్లు తీయగా.. ఇబ్రహిం తకహషీ, బెంజమిన్ ఇతో-డేవిస్ చెరో వికెట్ తీసుకున్నారు.

లక్ష్య ఛేదనలో జపాన్ గట్టిపోటీ ఇచ్చింది. అయితే, నిర్ణీత ఓవర్లలో ఆ జట్టు మూడు వికెట్ల నష్టానికి 30 పరుగులకే పరిమితమైంది. జపాన్ బ్యాటర్లలో కెండెల్ కడోవాకి-ఫ్లెమింగ్ (12), జెంజమిన్ ఇతో డేవిస్ (9) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు తీశాడు. ఓపెనర్ లచ్లాన్ యమమోటో లేక్ రనౌట్ అయ్యాడు.

మరికొన్ని విశేషాలు

అంతర్జాతీయ టీ20ల్లో భారత్‌కు ఇది 200వ విజయం. 2006లో దక్షిణాఫ్రికాపై తొలి విజయాన్ని నమోదు చేసిన టీమ్ఇండియా.. 2017లో శ్రీలంకపై 50వ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. వెస్టిండీస్‌పై 100వ (2022), ఆస్ట్రేలియాపై 150వ (2024) విజయాన్ని నమోదు చేసింది.

అత్యంత తక్కువ మార్జిన్‌తో టీమ్ఇండియా గెలిచిన మ్యాచుల్లో ఇది ఒకటి. దక్షిణాఫ్రికా (2012), బంగ్లాదేశ్ (2016) జట్లపై ఒక పరుగు తేడాతో నెగ్గిన భారత్.. శ్రీలంకపైనా ఓసారి (2023) రెండు పరుగులు తేడాతో విజయం సాధించింది.

ఐసీసీ శాశ్వత సభ్య దేశాల్లో భారత్ ఇప్పటివరకు 20 దేశాలపై ఆడిన తొలి మ్యాచ్‌ల్లో 17 సార్లు గెలుపొందింది. న్యూజిలాండ్, వెస్టిండీస్‌పై ఓడిపోగా.. స్కాట్లాండ్‌తో ఆడిన మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.

ఈ మ్యాచ్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఔటై గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. దీంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యంత చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. పొట్టి ఫార్మాట్‌లో ఎక్కువసార్లు గోల్డెన్ డక్ అయిన భారత ఓపెనర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20ల్లో 4 సార్లు ఇలా ఔటవ్వగా.. అభిషేక్ ఐదు సార్లు గోల్డెన్ డక్‌గా పెవిలియన్‌కు చేరాడు.

ఇక, ఒక క్యాలెండర్ ఏడాదిలో టీ20ల్లో అత్యంత ఎక్కువసార్లు డకౌట్ అయిన బ్యాటర్‌గానూ అభిషేక్ శర్మ మరో చెత్త రికార్డును తన పేరిట రాసుకున్నాడు. ఈ ఏడాది అతడు 10 సార్లు ఇలా ఔట్ అయ్యాడు. ఈ జాబితాలో 9 డకౌట్లతో రషీద్ ఖాన్ (2019), షాదాబ్ ఖాన్ (2024) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU, ASSOCIATE EDITOR MARUTHI BIKSHA REDDY Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945